Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 151 మేడ్చల్ మల్కాజ్‌గిరి 22 జూన్ 2023 గురువారం పేజీలు : 4

## కాబూల్‌లో ఇండియన్ మిషన్‌కు భద్రత కల్పిస్తాం

కాబూల్ : ఆఫ్ఘనిస్థాన్‌లో దౌత్య కార్యకలాపాలను ప్రారంభించేందుకు భారత ప్రభుత్వం చేస్తున్న కృషిని తాలిబన్లు స్వాగతించారు. తాలిబన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో, కాబూల్‌లోని ఇండియన్ మిషన్‌కు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆఫ్ఘనిస్థాన్‌లో భారత దేశ దౌత్య సంబంధాల వల్ల భారత్ గతంలో ప్రారంభించి, అసంపూర్తిగా మిగిలిపోయిన ప్రాజెక్టులు ఇప్పుడు పూర్తవుతాయని, కొత్త ప్రాజెక్టులు ఏర్పాటవుతాయని ఆశిస్తున్నట్లు ఈ ప్రకటనలో తాలిబన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. కాబూల్‌లో భారత దేశ దౌత్య ప్రాతినిధ్యాన్ని అప్‌గ్రేడ్ చేసేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను స్వాగతిస్తున్నామని తెలిపింది.




# 70మందితో తొలి జాబితా రెడీ?

## కేసీఆర్ దూకుడుపై పార్టీ శ్రేణుల్లో చర్చ!!

హైదరాబాద్ : బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ మంచి దూకుడు మీద ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరో నాలుగైదు నెలల్లో ఎన్నికలు జరగనున్న వేళ ఈసారి ఎలాగైనా ఎన్నికలలో విజయం సాధించాలని, మూడోసారి రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టాలని కృతనిశ్చయంతో ఉన్న కెసిఆర్ అందుకు తగ్గట్టుగా ముందస్తు వ్యూహాలతో ఎన్నికలకు రెడీ అవుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సర్వే చేయించిన కేసీఆర్, వివిధ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఫైనలైజ్ చేసే పనిలో ఉన్నారని పార్టీ శ్రేణుల్లో విస్తృతంగా చర్చ జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు అయిపోగానే మొదటి జాబితాగా 70 మందికి టికెట్లు ప్రకటించేందుకు కేసీఆర్ రెడీ అవుతున్నారని పార్టీ శ్రేణులలో జోరుగా చర్చ జరుగుతుంది. ఆరు నెలలకు ముందే టికెట్లు ప్రకటిస్తానని కేసీఆర్ గతంలో చెప్పిన నేపథ్యంలో ఆ మాట ప్రకారం కెసిఆర్ మొదటి జాబితాలో 70 మందికి టిక్కెట్లను ప్రకటించబోతున్నట్లు భావిస్తున్నారు. అయితే ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని సిట్టింగ్ ఎమ్మెల్యేలలో ఉత్కంఠ నెలకొంది. ఏయే నియోజకవర్గాలకు కేసీఆర్ టికెట్స్ ప్రకటిస్తారు? తమకు టికెట్ వస్తుందా లేదా? అన్న ఆందోళనలో పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన తర్వాత టికెట్లు ఇస్తే ఆశావహులు కొందరు నిరాశకు గురై ప్రత్యర్థి వర్గాలకు సహకరించే అవకాశం ఉందని భావిస్తున్న నేపథ్యంలో, ఆరు నెలల ముందుగానే టిక్కెట్లను ప్రకటిస్తే, అసంతృప్తులను బుజ్జగించడానికి, వారిని తిరిగి దారిలోకి తెచ్చుకోవడానికి సమయం సరిపోతుందని కేసీఆర్ భావిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా తిరుగుబాటు చేస్తే , పార్టీని వీడి వెళితే ఎన్నికల సమయంలో పెద్దగా ఎఫెక్ట్ ఉండబోదని కెసిఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గాలలో ప్రజా మద్దతు లేని సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇవ్వకూడదని భావిస్తున్న కేసీఆర్, అటువంటి నాయకులు పార్టీ వీడి వెళ్లినా ఇబ్బంది లేదనే భావనకు వచ్చినట్టు సమాచారం. ఏది ఏమైనా ఈసారి ఎన్నికలను సీరియస్‌గా తీసుకున్న కేసీఆర్ విజయాన్ని అందించే ఏ చిన్న అవకాశాన్ని వదులుకోకూడదు అని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే టిక్కెట్ల ప్రకటన ఆరునెలల ముందే చేయనున్నట్టు, అందుకు కేసీఆర్ తీవ్ర కసరత్తు చేస్తున్నారని పార్టీశ్రేణుల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

## ప్రజలు హాస్పిటల్‌కు వెళ్లకుండా ఉంటేనే ఆరోగ్య తెలంగాణ సాకారం: మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట: ప్రజలు హాస్పిటల్‌కు వెళ్లకుండా ఉంటేనే ఆరోగ్య తెలంగాణ సాకారవుతుందని మంత్రి హరీశ్ రావు అన్నారు. పెద్దపెద్ద హాస్పిటల్స్ కట్టడం ఆరోగ్య తెలంగాణ కాదని చెప్పారు. ఆరోగ్యం కోసం మనం ప్రతిరోజూ ఒక్క గంట సమయం కేటాయించి యోగ, ప్రాణాయామం చేస్తే మంచి జీవితాన్ని పొందొచ్చని సూచించారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సిద్దిపేట క్రికెట్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి హరీశ్ రావు యోగాసనాలు వేశారు. అనంతరం మాట్లాడుతూ.. నిత్య జీవితంలో యోగా భాగమైందని, చిన్న పెద్ద వయసుతో సంబంధం లేకుండా ప్రజలందరూ యోగ అలవర్చుకోవాలన్నారు. కొంతమంది రోగాల బారినపడిన తర్వాత ఆరోగ్యం కోసం చేసేది యోగా అని అపోహలో ఉన్నారని చెప్పారు. యోగా అనేది రోజూ సాధన చేయడం ద్వారా రోగాల బారిన పడకుండా దీర్ఘాయుష్షు లభిస్తుందని మంత్రి హరీశ్ అన్నారు. కొంతమంది నిర్లక్ష్యం చేయడం వల్ల అనారోగ్యం పాలవుతున్నారని, ఆధునిక ప్రపంచం ఆహార అలవాట్లు కూడా మనుషులను రోగాలపాలు చేస్తున్నాయని తెలిపారు. అన్నింటికీ పరిష్కారం యోగా ఒక్కటేనని వెల్లడించారు. అనవసర విషయాలు సెల్‌ఫోన్‌లో మాట్లాడడానికి సమయం ఉంటుంది కానీ.. యోగా చేయడానికి ఉండటం లేదన్నారు. చిన్న వయసులోనే ప్రజలు అనేక రోగాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన



వ్యక్తంచేశారు. యోగా అనేది ఒక్క శరీరానికే కాదు మనసుకు కూడా ఆరోగ్యం ఇస్తుంది. ప్రపంచ దేశాలు మన భారతదేశం నుంచి యోగా నేర్చుకుని ఆరోగ్యాన్ని పొందుతున్నారని చెప్పారు.

అన్ని దవాఖానల్లో గర్భిణీలకు, వారికి అనువైన యోగాసనాలు నేర్పిస్తున్నామని, దాని ద్వారా ఆరోగ్యమైన సుఖప్రసవం అవ్వడానికి అవకాశాలున్నాయని అన్నారు. గ్రీన్ కవర్ పెంపకంలో తెలంగాణ దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు.

## యాదాద్రిలో చిరుధాన్యాల లడ్డూ ప్రసాదం సేవలను ప్రారంభించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

యాదగిరిగుట్టలో చిరు ధాన్యాల ప్రసాదం, స్వామి వారి బంగారు, వెండి నాణేల విక్రయాన్ని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 3 గ్రాముల బంగారం డాలరు రూ. 21,000/-, 5 గ్రాములు వెండి రూ. 1,000/- 80 గ్రాముల మిల్లెట్ ప్రసాదం రూ. 40./- నిర్ణయించినట్లు తెలిపారు. అదే విధంగా భక్తుల సౌకర్యం కోసం వెబ్ పోర్టల్‌ను ఆవిష్కరించి, ఆన్ లైన్ టికెట్ సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. అనంతరం వృద్దులు, వికలాంగుల కోసం రూ. 21 లక్షల వ్యయంతో 3 బ్యాటరీ వాహనాలను అందుబాటులోకి తెచ్చామని ఆన్నారు. అంతకుముందు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని దేవాదాయ శాఖ



మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చిన మంత్రికి దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ఆలయ ఈఓ, అర్చకులు స్వాగతం పలికారు. శ్రీవారి ప్రధాన ఆలయంలో స్వయంబు దేవుడిని దర్శించుకున్న మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు మంత్రిని ఆశీర్వదించగా, ఆలయ ఈవో శ్రీస్వామివారి ప్రసాదాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొంగిడి సునీత రెడ్డి, జడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, YTDA వైస్ చైర్మన్ కిషన్ రావు, ఆర్కిటెక్ట్ ఆనంద్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కమలనాథులకు షాకులేనా?




## బీజేపీ నుంచి వారిద్దరు ఔట్..

## నిజమెంత?

హైదరాబాద్: ఇప్పటివరకు షాకులు ఇవ్వటమే తప్పించి షాకులు తినని కమలనాథులకు కొత్త తరహా అనుభవం ఎదురుకానుందా? ఒకప్పుడు పార్టీ హైప్ కు కారణమైనోళ్లే.. ఇప్పుడు కరెంటు షాక్ కొట్టి.. దిమ్మ తిరిగేలా చేయనున్నారా? అన్నదిప్పుడు ప్రశ్నలుగా మారాయి. గతంలో ఎప్పుడూ చోటు చేసుకోని పరిణామాలు తెలంగాణ బీజేపీలో చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్ర అధ్యక్షుడిని మార్చే ఆలోచనలో అధినాయకత్వం ఉందని.. కొత్త వారికి పగ్గాలు ఇవ్వబోతున్నారని.. పార్టీని ప్రక్షాళన చేసే దిశగా అడుగులు పడుతున్నాయని.. ఇలాంటి బోలెండత ప్రచారం సాగుతోంది. అయితే.. ఇదంతా కూడా ఈటల పుణ్యమే అన్న మాట వినిపిస్తోంది. బీజేపీ నేతల వాదన ప్రకారం.. పార్టీలో గుర్తింపు లేనట్లుగా ఈటల ఫీల్ అవుతున్నారని.. అందుకే తన ఉనికిని చాటుకునేందుకు ఆయన నానా రచ్చ చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఇటీవల కాలంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కేసీఆర్ ను.. ఆయన కుటుంబాన్ని తీవ్రంగా వ్యతిరేకించే పార్టీలో ఉండాలన్న ఆలోచన ఈటల.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మనసులో ఉందంటున్నారు. కర్ణాటకలో బీజేపీ ఓటమి.. కేసీఆర్ కుటుంబంపై పెట్టిన కేసుల్లో కదలిక లేని నేపథ్యంలో.. బీజేపీలో ఉండటంపై ఈటల.. కోమటిరెడ్డి ఆలోచనల్లో మార్పులు వస్తున్నట్లుగా చెబుతున్నారు. ఈ అంశంపై క్యాడర్ నుంచి వస్తున్న ఒత్తిళ్ల నేపథ్యంలో ఉమ్మడి నిర్ణయాన్ని తీసుకునేందుకు ఇటీవల కాలంలో తరచూ వారిద్దరు భేటీ అవుతున్నట్లు చెబుతున్నారు. తాజాగా వారి భేటీ కమలనాథుల్లో కొత్త చర్చగా మారింది. ఈ ఇద్దరు నేతల భేటీలకు మొదట్లో పెద్దగా ప్రాధాన్యత ఇవ్వనప్పటికీ.. ఇటీవల కాలంలో పార్టీకి సంబంధించిన పలు అంశాలు లీకులు కావటంపై అధినాయకత్వం స్పెషల్ ఫోకస్ పెట్టినట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే కొత్త పరిణామాల్ని గుర్తించినట్లుగా చెబుతున్నారు. విశ్వసనీయ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. కాంగ్రెస్ లోకి వెళ్లేందుకు ఈ ఇద్దరు నేతలు ప్లానింగ్ చేస్తున్నారని.. త్వరలో ఆ సీన్ తెర మీదకు రానున్నట్లు చెబుతున్నారు. అయితే.. ఇదంతా బీజేపీలోని ఒక వర్గం చేస్తున్న ప్రచారంగా ఈటల సన్నిహితులు వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తంగా చూస్తే.. బీజేపీకి ఈటల.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు కరెంటు షాక్ ఇచ్చే అవకాశాలే ఎక్కువన్న మాట వినిపిస్తోంది. ఇదెంత వరకు నిజమన్నది కాలమే సరైన సమాధానం ఇవ్వనుంది.

## సంపాదకీయం

### ప్రపంచ గుర్తింపే.. మనసులో మాటకు ప్రతీక

# మోడీ వ్యూహం

తాజాగా ప్రధాని నరేంద్ర మోడీ.. ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహించే మన్ కీ బాత్(మనసులో మాట)కు.. 100 ఎపిసోడ్లు పూర్తయ్యాయి. అయితే.. 100 ఎపిసోడ్‌ను ప్రపంచ వ్యాప్తంగా రూ.100 కోట్లు ఖర్చు పెట్టిమరీ భారీ ఎత్తున ప్రచారం చేశారు. అయితే.. దీని వెనుక వ్యూహం ఉందనేది జాతీయ మీడియా మాట. ప్రపంచ గుర్తింపు కొరుతున్న ప్రధాని మోడీ.. చాలా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు. 2024 ఎన్నికలను ప్రభావితం చేయగల రీతిలో ఆయన ఈ 100 వ ఎపిసోడ్ను తీర్చిద్దారని చెబుతున్నాయి. ఇక మన్ కీ బాత్ వందో ఎపిసోడ్ అమెరికాలోనూ ప్రసారమైంది. దీనిని గౌరవిస్తూ అమెరికాలోని న్యూయార్క్ న్యూజెర్సీ రాష్ట్రాలు ప్రత్యేక తీర్మానాలు చేశాయి. అనంతరం వాటిని భారత విదేశాంగ మంత్రి జైశంకర్కు అందజేశాయి. అదేవిధంగా ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలోనూ ప్రధాని మోడీ మన్కీ బాత్ వందో ఎపిసోడ్ను ప్రసారం చేశారు. అమెరికాలో నిర్వహించిన మన్కీ బాత్ వందో ఎపిసోడ్లో ప్రవాసాంధ్రులతో కలిసి విదేశాంగ మంత్రి జైశంకర్ పాల్గొన్నారు. లండన్లోని ఇండియా హౌస్లో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఎన్ఆర్ఐలు.. హై కమిషన్ అధికారులతో కలిసి మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కనీవినీ ఎరుగని ఏర్పాట్లు చేయడం ఈ దఫా 100వ ఎపిసోడ్ప్రాధాన్యం. దేశవ్యాప్తంగా ప్రధాని మోడీ మన్కీ బాత్ వందో ఎపిసోడ్ను కనీవినీ ఎరుగని ఏర్పాట్లతో కోట్లాది మంది ప్రజలు ఆలకించేలా భారతీయ జనతా పార్టీ ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా 4 లక్షల ప్రాంతాల్లో.. ప్రజలు మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. దేశంలోని ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో సరాసరిన వంద చోట్ల ప్రజలు ఆలకించేలా కమలం పార్టీ ఏర్పాట్లు చేసింది. గవర్నర్ల అధికారిక నివాసమైన అన్నిరాష్ట్రాల రాజ్ భవన్లు బీజేపీ పాలిత రాష్ట్రాలు మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రుల నివాసాల్లో మన్ కీ బాత్ వందో ఎపిసోడ్ను ప్రసారం చేశారు. మొత్తంగా చూస్తే.. 2024 ప్రతిబింబం.. స్పష్టంగా కనిపించిందనేది విశ్లేషకుల మాట.

## నిలిచిన డయాలసిస్ సేవలు!



ఆదిలాబాద్ : రాజీవ్‌గాంధీ వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్)లోని డయాలసిస్ కేంద్రంలో రక్తశుద్ధి సేవలు ఆరు రోజులుగా నిలిచిపోయాయి. ఇటీవల పడిన ఏకధాటి వర్షాల కారణంగా ఈ కేంద్రంలోని డయాలసిస్ యంత్రాల్లోకి తేమ చేరి అవన్నీ చెడిపోయాయి. ఫలితంగా నిత్యం ఇక్కడ రక్తశుద్ధి కోసం వచ్చే బాధితులను అధికారులు నిర్మల్, ఉట్నూర్‌కు పంపిస్తున్నారు. దీంతో బాధితేలే తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆదిలాబాద్ రిమ్స్ రక్తశుద్ధి(డయాలసిస్) కేంద్రంలో పది పడకలు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ పథకంలో ప్రతి రోజు ఒక్కొక్క షిఫ్టులో పది మంది బాధితుల చొప్పున 30-40 మందికి ఇందులో ఉచితంగా రక్త శుద్ధి చేస్తుంటారు. నిత్యం నాలుగు షిఫ్టుల్లో ఈ సేవలు కొనసాగుతుంటాయి. అయితే గత నుంచి కేంద్రంలోని అన్ని డయాలసిస్ యంత్రాలు చెడిపోయాయి. రక్తశుద్ధికి వచ్చే బాధితులను సిబ్బంది నిర్మల్, ఉట్నూర్ కేంద్రాలకు పంపతున్నారు. ఆదిలాబాద్ నుంచి దాదాపు 80 కిలోమీటర్ల దూరంలోని నిర్మల్, 40 కిలోమీటర్లకు పైగా దూరంలోని ఉట్నూర్‌కు వెళ్లాలంటే వారు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. రక్త శుద్ధి చేయించుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం. విధి లేని పరిస్థితుల్లో ఆయా ప్రాంతాలకు వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది.

భారీ వర్షాలతో తేమ కారణంగా..

రక్తశుద్ధి కేంద్రానికి కేటాయించిన భవనంలో సరైన ఏర్పాట్లు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తేమ భవనంలోకి చొరబడి డయాలసిస్ యంత్రాల్లోకి చేరింది. అందులోని పలు సున్నితమైన పరికరాలు చెడిపోయాయి. ఈ యంత్రాల్లోని నీటి పైపుల్లోనూ లీకేజీలు ఏర్పడ్డాయి. తేమ కారణంగా యంత్రాలు చెడిపోతాయన్న విషయం తెలిసినప్పటికీ ముందస్తుగా సరైన జాగ్రత్తలు తీసుకోకపోవటంతో ఈ పరిస్థితి నెలకొందన్న విమర్శలు చోటు చేసుకుంటున్నాయి.

మూడు రోజులుగా కొనసాగుతున్న మరమ్మతులు..

ప్రత్యేక నిపుణుల ఆధ్వర్యంలో చెడిపోయిన డయాలసిస్ యంత్రాల మరమ్మతులు మూడు రోజులుగా కొనసాగుతూనే ఉన్నాయి. నాటికి కేవలం రెండు యంత్రాలను కొంతమేర వరకు పునరుద్ధరించగలిగారు. మరో ఎనిమిది యంత్రాలు మరమ్మతు చేయాల్సి ఉంది. ఆసుపత్రి పర్యవేక్షకుడు అశోక్ ఈ కేంద్రాన్ని సందర్శించి యంత్రాలను పరిశీలించారు. మరమ్మతులు పూర్తి చేయాల న్నారు.నుంచి సేవలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పాడైపోయిన యంత్రాలు ఇవే..

భారీ వర్షాల కారణంగా చెడిపోయిన డయాలసిస్ యంత్రాలివి. తేమ చొరబడటంతో అందులోని సున్నితమైన పరికరాలు పాడైపోయాయి. తేమ బయటకు వెళ్లడానికి ఇలా వాటిని తెరచి ఉంచారు.

## బంధాలు తెగిపోతున్నాయి



ఎదులాపురం : కని, పెంచి పోషించిన కన్న వారిని సైతం బాంధావ్యాలు మరిచి అమానవత్వంగా కొందరు వదిలేసుకుంటున్నారు. కాటికి కాళ్లు చాపి అవసాన దశలో ఉన్న వారు తమ వారసుల నుంచి ప్రేమానురాగాలు పొందాలని భావిస్తుంటారు. ఇలాంటి వారు ఏ మాత్రం అనారోగ్యానికి గురైనా వైద్యం వంకతో రిమ్స్‌లో చేర్పించి ఆ తరువాత పత్తాలేకుండా పోతున్నారు. ఆసుపత్రిలో తప్పుడు చిరునామాలు అందించి కొందరు.. బాధితునితో తమకెలాంటి సంబంధం లేనట్లుగా మరికొందరు ఆసుపత్రిలో చేర్పించి ఆనక కనబడకుండా పోతున్నారు. జీవితాంతం పిల్లల ఉన్నతికి ఎంతో చేసిన వారికి కొంత సేవ చేయకుండా వదలేస్తున్న ఉదంతాలు మానవత్వాన్ని, బంధాలను ప్రశ్నిస్తున్నాయి. అంతా ఉండి కూడా అనాథల్లా ప్రాణాలొదులుతున్న విషాద ఘటనలు ఇటీవలి కాలంలో అనేకం చోటు చేసుకున్నాయి.

ఎవరు చేర్చారో తెలియదు

గుర్తు తెలియని వ్యక్తులు దాదాపు 75 ఏళ్ల వృద్ధుడిని గత నెల 3న చేర్పించారు. మూడు రోజులు అతనికి ఆసుపత్రిలో సిబ్బంది చికిత్సలు అందించారు. కనిపెట్టుకొని ఉండాల్సిన సంబంధీకులు ఎవరూ లేక ఆ వృద్ధుడు ఆరో తేదీన మృతి చెందాడు. బంధువులు ఎవరైనా వస్తారేమోనని వారం రోజులపాటు శవాన్ని శవాగారంలో ఉంచిన అనంతరం ఎవరూ రాకపోవటంతో అనాథగా అంత్యక్రియలు చేయించారు

అనాథగా మృతి చెందాడుమార్చి 24న దాదాపు 45 సంవత్సరాల వ్యక్తి రిమ్స్‌లో చేరాడు. అపస్మారక స్థితిలో కనీసం మాట్లాడలేని స్థితిలో ఉన్న అతడిని అత్యవసర చికిత్స అవసరం ఉండటంతో సిబ్బంది కనీసం వివరాలు రాసుకోకుండా ఆసుపత్రిలో చేర్చుకున్నారు. ఆసుపత్రిలో చేర్చిన వారు ఆ తరువాత కనబడకుండా పోయారు. ఆ వ్యక్తి చికిత్స పొందుతూ రెండు రోజుల అనంతరం మృతి చెందాడు. ఎక్కడి వాడో తెలియక శవాన్ని వారం రోజులు భద్రపర్చిన అనంతరం ఒక స్వచ్ఛంద సంస్థ వారు అతనికి అంత్యక్రియలు నిర్వహించారు.

తప్పుడు చిరునామాతో చేర్పించారు..

కామునాబాయి(80) అనే వృద్ధురాలు అస్వస్థతతో గత నెల 22న రిమ్స్‌లో చేరింది. ఆమెను ఆసుపత్రిలో చేర్పించిన వారు ఆమెది ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌గా పేర్కొంటూ వివరాలు రాయించారు. వారం రోజుల పాటు ఆమె ఆసుపత్రిలో ఉన్నా సంబంధీకులు ఎవరూ రాలేదు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. కేస్‌షీట్లో పేర్కొన్న వివరాల ప్రకారం రిమ్స్ సిబ్బంది శాంతినగర్‌లో వాకాబు చేయగా ఆమె చిరునామా లభించలేదు. దీంతో శవాన్ని పురపాలక సంఘానికి అంత్యక్రియల కోసం అప్పగించారు.

వృద్ధునిదీ అదే తీరు..

గత నెల 13న ఒక ఆటో డ్రైవర్ బి.సాయన్న అనే 65 ఏళ్ల వృద్ధుడిని రిమ్స్‌లో చేర్పించారు. వృద్ధుడు జైనథ్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా వివరాలు రాయించారు. ఈ వృద్ధుడు చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. అతని బంధువుల కోసం రిమ్స్ యాజమాన్యం రాంపూర్‌లో వాకాబు చేయగా ఫలితం లేకుండా పోయింది. సంబంధీకులే అతనిని వదిలించుకోవటానికి ఇలా రిమ్స్‌లో వదిలేసి వెళ్లిపోయినట్లుగా భావిస్తున్నారు. ఆ వృద్ధుడిని అనాథ శవంగా అంత్యక్రియలు చేసేశారు.

## పంట నష్టం.. రూ.19.56 కోట్లు

నిర్మల్ : పది రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలు అన్నదాతను నష్టాల్లో ముంచేశాయి. విత్తిన విత్తనాలు మొలకదశలో అతివృష్టి పగబట్టడంతో ఆశలు ఆవిరయ్యాయి. పంటలకు పెట్టిన పెట్టుబడులు నేలమట్టమయ్యాయి. పత్తి, సోయా, మొక్కజొన్న, కందులు, ఇతరత్రా దెబ్బతిన్నాయి. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 25,108 ఎకరాల్లో పంటలు వర్షార్పణమయ్యాయి. ఈ లెక్కన అన్నదాతకు రూ. 19.56 కోట్ల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదక పంపించారు. పసుపు, వరి నార్లు, ఇతర పంటల లెక్కల్లోకి తీసుకోలేదు.

3,970 ఎకరాల్లో కోతకు.. 3,473 ఎకరాల్లో ఇసుక మేటలు

ఈ వానాకాలం సీజన్‌లో మొన్నటివరకు పంటలపై ఆశలు పెట్టుకున్న రైతులకు భారీ వర్షాలు వారి ఆశలపై వరుణుడు నీళ్లుచల్లాడు. 25,108 ఎకరాల్లో పత్తి, సోయా, మొక్కజొన్న, కందులు, ఇతరత్రా పంటలు నేలమట్టమయ్యాయి. ఇక్కడ, అక్కడ అనితేడాలేకుండా అన్ని ప్రాంతాల్లో కురిసిన భారీవర్షాలకు పంటలు కొట్టుకుపోయి అన్నదాతలకు పెట్టుబడి నష్టాన్ని మిగిల్చాయి. ముఖ్యంగా సాగుచేస్తున్న పత్తి, సోయా, మొక్కజొన్న, కందులు, తదితర తదితర పంటలు బాగున్న క్రమంలో కురిసిన భారీ వర్షాలు కుదేలు చేసింది. భైంసా, మామడ, కుభీరు, తానూరు, సారంగాపూర్, పెంబి మండలాల్లో పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. చాలా గ్రామాల్లోని పంట చేలు కోతకు గురికావడంతోపాటు ఇసుకమేటలు వచ్చిచేరాయి. కళ్లముందే పంటచేలు వరదనీటితో నిండిపోవడం చూసి ఆవేదన చెందుతున్నారు. 3,970 ఎకరాల భూమి కోతకు గురైంది. మరో 3,473 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. కోతకు గురైన భూమి బాగు చేయడంతోపాటు ఇసుక మేటలు తొలగించడం రైతన్నకు మరింత ఆర్థికంగా భారం కానుంది.

## ఏడాది గడిచినా.. ఏదీ అవగాహన..?

మంచిర్యాల : అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా, సంక్షోభ సమయంలో కేంద్ర ప్రభుత్వ సాయం పొందేలా దేశవ్యాప్తంగా గతేడాది ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ పోర్టల్‌కు ఉమ్మడిజిల్లాలో స్పందన అంతంత మాత్రంగానే ఉంది. దీని ప్రయోజనాలపై కార్మికులకు అవగాహన కల్పించడం కరవైంది. నాలుగుజిల్లాల్లో ఇదే పరిస్థితి. కార్మికులు సైతం ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. ఈ-శ్రమ్ అందుబాటులోకి వచ్చి ఏడాది అవుతున్నా అర్హులు సగం కూడా చేరలేదు. అసంఘటితరంగ కార్మికులందరిని కార్మికశాఖ గుర్తించినా వారిని ఇందులో చేర్చడంలో మాత్రం వెనుకబడిపోయింది. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటికి కనీసం 50శాతం కూడా పూర్తికాలేదు.

ఈ-శ్రమ్ కార్డుదారులకు ప్రభుత్వం ప్రమాదబీమా దాదాపు రూ. 2లక్షలు ఇవ్వనుంది. గాయపడి వికలాంగులుగా మారినా సుమారు రూ.లక్ష అందించనుంది. సాధారణ మృతి, కార్మికుల కుటుంబసభ్యులు వివాహం, చదువు కోసం ఆర్థికసాయం సైతం పొందేందుకు అర్హత ఉంటుంది.



వయసు 16-59 సంవత్సరాలు ఉన్న వ్యక్తులు పీఎఫ్, ఈఎస్ఐ, ఆదాయపుపన్ను చెల్లించనివారు ఈ కార్డు పొందేందుకు అర్హులు. అడ్డా కూలీ దగ్గర నుంచి షాపింగ్‌మాల్, హోటల్స్, పేయింటర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, చేనేత కార్మికులు, వడ్రంగులు తదితర దాదాపు 54 రకాల రంగాలకు చెందిన కార్మికులు ఈ కార్డు పొందవచ్చు.

ఈ-పోర్టల్‌లో నమోదుకు కావాల్సిన పత్రాలు.. ఆధార్ నంబరు, బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో చేసుకోవచ్చు. సొంతంగా చేసుకోవడం ఇబ్బందిగా ఉంటే కామన్ సర్వీస్ సెంటర్‌లలో ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు తీసుకెళ్లి నమోదును ఉచితంగా చేయించుకోవచ్చు.

మొబైల్ సదుపాయం లేనివారు సైతం వేలిముద్ర, ఐరిస్ సాయంతో నమోదు చేసుకోవచ్చు.

ఆదిలాబాద్‌జిల్లాను మినహాయిస్తే మిగతా ఏ జిల్లాలోనూ సగం కూడా పూర్తికాలేదు. మంచిర్యాల 50శాతానికి చేరువ కాగా నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్‌జిల్లాలు మరీ అధ్వానంగా ఉన్నాయి. సగానికే చాలా దూరంలో ఉన్నాయి.

అవగాహన లేకపోవడంతోనే..

అసంఘటితరంగ కార్మికులు లక్షల్లో ఉన్నా ఈ కార్డు పొందినవారు చాలా తక్కువ మంది ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. నిరక్షరాస్యతతో పాటు ఉపయోగాలపై అవగాహన లేకపోవడం కారణం. కార్మికశాఖ అధికారులు, కార్మిక సంఘాల నాయకులు సంబంధిత అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. యజమానులు సైతం దీని ప్రయోజనాలను తెలియజేసి, నమోదు చేసేందుకు ముందుకురావాలి.

ఈ-శ్రమ్‌లో నమోదు సగమే..

ఇటీవల మంచిర్యాలలోని వ్యాపార సంఘం నాయకులు ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసి కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయిస్తున్నారు స్వచ్ఛందంగా ముందుకురావాలిఎ.ఎస్.వినిత, ఏసీఎల్, మంచిర్యాల చాలామంది కార్మికుల బ్యాంకు ఖాతాలు ఆధార్ సంఖ్యతో అనుసంధానం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీరిని ఈ-శ్రమ్‌లో నమోదు చేయడం కష్టంగా మారింది. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, కార్మికులకు ఈ-శ్రమ్‌పై వివరిస్తున్నా ముందుకురావడంలేదు. కార్మికశాఖతో పాటు వీరు సైతం ఆసక్తి చూపిస్తేనే విజయవంతానికి అవకాశం ఉంటుంది.

## శిథిల భవనం..బడికెళ్లాలంటే భయం

నిర్మల్ : ఇటీవల కురిసిన భారీ వర్షాల అనంతరం సర్కారు బడుల పరిస్థితులు భయాందోళనలు కలిగిస్తున్నాయి. ఏళ్ల క్రితం నిర్మించి, శిథిలావస్థకు చేరుకున్న, ఊరుస్తున్న తరగతి గదుల మధ్య కాలం వెల్లదీస్తున్నారు. భారీ వర్షాలు, వరదలతో విద్యాలయాలకు వారం రోజులు సెలవులు ఇవ్వగా సోమవారం పునః ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో 'ఈనాడు' జిల్లాలోని పాఠశాలలపై క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. పలుచోట్ల ప్రమాదకర స్థితిలో విద్యాబోధన చేస్తున్న విషయం వెల్లడైంది.జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాలకు సంబంధించి 735 బడుల్లో 47,384 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పలు చోట్ల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏళ్లక్రితం నిర్మించినవి కావడంతో పైకప్పులు దెబ్బతిని గోడలు తడిగా మారి పెచ్చులూడి, ఊరుస్తున్నాయి. వర్షపు నీరు నిల్వఉండటంతో విద్యాభ్యాసం చేసేందుకు పిల్లలు పలు ఇబ్బందులెదుర్కొంటున్నారు. మన ఊరు-మనబడి, మన బస్తీలో మొదటి విడతగా 260 ఎంపిక చేయగా, ఇందులో 172 చోట్ల రూ. 30 లక్షల్లోపు ఉండడంతో ఇందులో నుంచి 90 బడుల్లో మాత్రమే పనులు ప్రారంభమయ్యాయి. వర్షాలకు అవి కూడా జరగడం లేదు. కొన్ని చోట్ల నిధులు లేక పనులు చేయడం లేదు.

ఇంకా కొన్ని చోట్లలో.. దిలావర్‌పూర్ మండలం లోలం, లోకేశ్వరం మండలం రాయపూర్‌కాండ్లి, హథ్‌గాం, ఖానాపూర్ మండలం బాదన్‌కుర్తి ప్రాథమికోన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పురాతనమైనవి కావడంతో ఊరుస్తున్నాయి.

భైంసా మండలం కుంసర, తానూరు మండలం ఉమ్రి(కె) ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో చోట రెండు గదులు మాత్రమే ఉన్నాయి. పైకప్పు ఉరవడం, గదుల్లో నీళు నిల్వడం వంటి సమస్యలతో వరండాల్లో నిర్వహిస్తున్నారు.

నిర్మల్ మండలం అనంతపేట్ ఉన్నత పాఠశాలలో పైకప్పు దెబ్బతింది. దీంతో 9, 10 తరగతులు ఒకే గదిలో నిర్వహిస్తున్నారు.

ముథోల్: బాసర మండలం సోలాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి పెద్ద మొత్తంలో నీళ్లు నిలిచాయి. ఉన్న రెండు గదులు, వరండా పూర్తిగా జలమయం కావడంతో గ్రామస్థులు వచ్చి వాటిని తోడేశారు. విద్యార్థులను గ్రామపంచాయతీలో కూర్చోబెట్టి బోధన చేశారు. ముథోల్ బాలికల ఉన్నత పాఠశాలలో సుమారు 190 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఇక్కడ మూడు గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో వరండాల్లో బోధించాల్సి వస్తోంది. భవనం శిథిలావస్థకు చేరుకుంది.

పై కప్పు మట్టి పడడం, ఊరుస్తుండడంతో కట్టిన ప్లాస్టిక్ కవర్

- నిర్మల్ మండలం వెంగ్వాపేట్‌లో 1976లో నిర్మించిన ప్రాథమిక పాఠశాలలో 132 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయిదు ఇరుకు గదుల్లో నుంచి ఒక దానిని స్టాఫ్ రూంగా, మిగతా వాటిని తరగతులకు వినియోగిస్తున్నారు. వీటికంటే ముందే నిర్మించిన మరో రెండు గదులున్నా అవి ప్రమాదకరంగా మారింది, మరో గది పనికిరాకుండా ఉన్నాయి. తల్లిదండ్రులు, పోషకులు, గ్రామస్థుల సహకారంతో ఏడేళ్లుగా ఇక్కడ ఆంగ్ల మాధ్యమ బోధన జరుగుతోంది. అయితే వసతులు లేవు.తరగతి గదిలో సాధారణంగా విద్యార్థులు నేలపై, బల్లలపై కూర్చొని చదువు కోవడం అందరికీ తెలిసిన విషయమే. కానీ ఈ పాఠశాలలలోని విద్యార్థుల పరిస్థితి అందుకు భిన్నం. పగలంతా వారు నిలబడే పాఠాలు వినాల్సిన దయనీయస్థితి. సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల దుస్థితి చూస్తే పాపం అనని వారుండరు. 83 మంది విద్యార్థులున్న విద్యాలయంలో అయిదుగురు ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారు.

# అన్నదాత చూపు ఆకాశం వైపు

పెద్దపల్లి : వానాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ తొలకరి చినుకు కరవైంది. ఆకాశం వైపు అన్నదాత చూసే పరిస్థితి నెలకొంది. విత్తులు నాటేందుకు దుక్కులు సిద్ధం చేసిన రైతులు నిరీక్షిస్తున్నారు. మృగశిర కార్తె నడుస్తున్నప్పటికీ రుతుపవనాల జాడ లేదు. గతంలో ఎన్నడు లేనివిధంగా జూన్ మూడో వారంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదు కాలేదు. వరుణుడుపై ఆశలు పెట్టుకున్న కొందరు రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరగడంతో విత్తనాలు మాడిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి గట్టెక్కించేందుకు ఈ ఏడాది వ్యవసాయ శాఖ సాగు కాలాన్ని ముందుకు తీసుకెళ్లాలని భావిస్తోంది.

2.83 లక్షల ఎకరాల సాగు లక్ష్యం

జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 2.83 లక్షల ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు కానుందని అంచనా వేశారు. ఇందులో 2.13 లక్షల ఎకరాల్లో వరి, 65 వేల ఎకరాల్లో పత్తి పంటలు సాగు కానున్నాయని వ్యవసాయ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గతేడాది 81,270 ఎకరాల్లో పత్తి అంచనా వేయగా భారీ వర్షాలతో కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నీటిలో పత్తి పంట మునగడంతో 64 వేల ఎకరాలకు పరిమితమైంది. జిల్లాలో ప్రధాన నీటి వనరులైన ఎస్సారెస్పీ నీరుపైనే ఆధార పడాల్సి వస్తోంది.

వర్షపాతం లోటు

జిల్లాలో గడిచిన రెండేళ్లలో గణాంకాలు పరిశీలిస్తే వర్షపాతం లోటు కనిపిసోంది. ఈ ఏడాదిలో మొత్తం 1035.8 మి.మీ. వర్షాపాతం అంచనా ఉంది. జూన్‌లో 91.5 మి.మీ. సాధారణ వర్షపాతం ఉండగా ఇప్పటి వరకు 4.5 మి.మీ. మాత్రమే నమోదైంది. గతేడాది ఇదే నెలలో 72.5 మి.మీ. వర్షం కురిసింది. మూడో వారం నడుస్తున్నా.. వర్షం కురియకపోవడంతో పంటల సాగుపై సందిగ్ధం నెలకొంది. వాతావరణ శాఖ ఐదేళ్లకొసారి సాధారణ వర్షపాతం లెక్కించగా ప్రస్తుతం 30 ఏళ్లకు పొడిగించారు.

పది వేల ఎకరాలకు పైనే పత్తి

జిల్లాలో ఇప్పటి వరకు పది వేల ఎకరాల్లోనే పత్తి సాగు చేశారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దుక్కులు సిద్ధం చేసుకుని వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. పెరుగుతున్న ఎండలతో పత్తి విత్తనాలు మాడిపోవడంతో రైతులు కలవరపడుతున్నారు. మరోవైపు బోర్ల కింద వరి నార్లు పోసేందుకు సమాయత్తమవుతున్నారు. వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించింది. ఏ రకమైన పంటలు వేస్తే రైతులకు లాభసాటిగా ఉంటుందనే కోణంలో పరిశీలిస్తున్నారు.

# ఆధునిక హంగులతో కూరగాయల మార్కెట్

వేములవాడ : ఆధ్యాత్మిక కేంద్రమైన వేములవాడ పట్టణంలో కూరగాయల రైతులు, వినియోగదారులకు సౌకర్యంగా ఉండే విధంగా ఆధునిక హంగులతో కూరగాయల మార్కెట్ నిర్మించారు. ఇది పూర్తి కావడంతో ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఎప్పటి నుంచో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, వినియోగదారులకు కష్టాలు తీరనున్నాయి.

పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ముందు శామకుంటలో రూ. 2.7 కోట్ల మున్సిపల్ నిధులతో అధునాతన వసతులతో సమీకృత (ఇంటిగ్రేటేడ్) మార్కెట్ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవానికి మున్సిపల్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు పట్టణంలో సరైన కూరగాయల మార్కెట్ లేక పట్టణ ప్రజలు, కూరగాయల వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రత్యేక చొరవతో శామకుంట, మార్కెట్ యార్డులో రెండు మార్కెట్లను ఆధునిక హంగులతో నిర్మాణానికి సంకల్పించారు. వేములవాడ పట్టణం చుట్టు పక్కల గ్రామాలతో పాటు బోయినపల్లి, కోనరావుపేట, చందుర్తి తదితర ప్రాంతాల నుంచి కూరగాయలు తీసుకువచ్చే రైతులకు సైతం సరైన మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పట్టణంలోని తెలంగాణ కూడలి వద్ద, రెండో బైపాస్ రోడ్డులోని గంగమ్మ గుడి వద్ద కూరగాయల మార్కెట్లు రహదారుల పక్కన అసౌకర్యాల మధ్య నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూరగాయల మార్కెట్‌కు సరైన స్థలం లేక రైతులు, విక్రయదారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శామకుంటలో రూపుదిద్దుకున్న సమీకృత కూరగాయల మార్కెట్‌ను ప్రారంభిస్తే ఇక పట్టణంలోని రోడ్లపై క్రయ, విక్రయాల సమస్య శాశ్వతంగా తొలగిపోనుంది.

ఉపయోగంగా...

పట్టణంలోని శామకుంట కూరగాయల మార్కెట్‌ను అన్ని హంగులతో



నిర్మించారు. కూరగాయలకు సంబంధించి గ్రౌండ్ ఫ్లోర్‌లో 51, పైఅంతస్తులో 51 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో కూరగాయలతో పాటు పండ్లు విక్రయ దుకాణాల స్టాల్స్ నిర్మించారు. మొదటి అంతస్తులో కూరగాయలు, పండ్లు నిల్వ చేసేందుకు కోల్డు స్టోరేజ్ కట్టారు. అన్ని రకాల కూరగాయలు, పండ్లు ఇక్కడ లభించేలా స్టాల్స్ ఏర్పాటు చేశారు. విక్రయదారులకు ఇబ్బందులు లేకుండా ప్లాట్‌ఫారాలు నిర్మించారు. కూరగాయలు నిల్వ చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణ ప్రజలకు వివిధ రకాల కూరగాయలు, పండ్లు ఈ మార్కెట్‌తో అందుబాటులోకి రానున్నాయి. పట్టణం మధ్యలో మార్కెట్ ఉండటంతో ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉండనుంది.

ప్రారంభోత్సవానికి సిద్ధం చేశాం- అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

పట్టణంలోని శ్యామకుంటలో కూరగాయల మార్కెట్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేశాం. ఇందులో రైతులు, వినియోగదారులకు అన్ని సౌకర్యాలు ఉండే విధంగా నిర్మాణం పూర్తయింది. ఈ కూరగాయల మార్కెట్ ప్రారంభిస్తే రోడ్లపై క్రయ, విక్రయాలు చేసే రైతులకు, వినియోగదారుల ఇబ్బందులు పూర్తిగా తొలగనున్నాయి. త్వరలోనే ఈ మార్కెట్‌తో పాటు పూర్తయిన పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తాం.

# అసంపూర్తిగా అభివృద్ధి పనులు



జనగామ : జనగామ పట్టణంలో మున్సిపాల్టీ పరిధిలో చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధులున్నా పూర్తి కానివి కొన్ని, ప్రతిపాదనలకే పరిమితమైనవి మరికొన్ని. పట్టణ సుందరీకరణ, అభివృద్ధి కోసం వివిధ పథకాల కింద నిధులు మంజూరైనా సకాలంలో పనులు పూర్తి కావడం లేదు.

సుందరీకరణ పనులు ఇలా..స్థానిక రోడ్డు ఓవర్ బ్రిడ్జి కింద ఖాళీ స్థలాన్ని సమీప ప్రాంతాల వారు వివిధ వ్యాపార సామగ్రిని నిల్వ చేసేందుకు వినియోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం వారధి కింద జన సంచారం లేకుండా చూడాల్సి ఉంది. గతంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి వారధి కింద పచ్చదనం, పరిశుభ్రతకు గార్డెనింగ్ పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. నాలుగేళ్ల క్రితం ఆయన చేసిన ప్రతిపాదనకు గతేడాది కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రూ.10 లక్షలతో నాగులకుంట నుంచి రైల్వే పాతగేటు వరకు గార్డెనింగ్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఆరు మాసాల క్రితం పనులు చేపట్టారు. ఒక వైపు సిమెంటు రెయిలింగ్ నిర్మించారు. మొక్కలు నాటేందుకు, పచ్చదనం పెంపునకు మట్టిపోసి వదిలేశారు. మరోవైపు రెయిలింగ్ నిర్మాణ పనులు పూర్తి కాలేదు. నిధులు లేవంటూ పనులను అసంపూర్తిగా వదిలేశారు. సీపీఐ కార్యాలయం పక్కన వారధి వెంట రహదారి నిర్మాణం పూర్తయితే ఇరువైపులా రద్దీని నివారించవచ్చు. మట్టిపోసి వదిలేయడంతో పరిస్థితి మొదటికి వచ్చింది. లిపనులను పూర్తి చేసేందుకు మరో రూ.10 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మిగులు పనులకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధాన రహదారి వెంట కాల్వ పనులు చేస్తున్న గుత్తేదారు ఈ పనిని పూర్తి చేయాల్సి ఉంది. కాల్వ పనుల్లో తలమునకలైనందున ఇక్కడ పనులు జరగలేదంటున్నారు.

నెలల తరబడి జాప్యం

స్థానిక ప్రధాన రహదారుల వెంట ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థలోని స్తంభాలు కొన్ని చోట్ల కూలిపోయాయి. హైదరాబాద్ రహదారిలో మూడు చోట్ల, సిద్దిపేట రహదారిలో రెండు చోట్ల కూలిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు మూడు మాసాల క్రితం కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రూ.లక్షతో చేపట్టే పనులు సైతం జరగడం లేదు. హైదరాబాద్ రహదారి వెంట విభాగిని నిర్మాణం పూర్తి కాకముందే స్తంభాలు, దీపాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. లిస్థానిక వాసవి కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. సంజయ్‌నగర్‌లో కూడలి అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వీవర్స్‌కాలనీ పెద్ద కల్వర్టు అనుసంధాన రహదారి పనులను ప్రారంభించి వదిలేశారు. రూ.6.50 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ పనుల్లో భాగంగా నిర్మించాల్సిన పూలు, పండ్ల మార్కెట్ పనులు పునాదిదశలో ఉన్నాయి. రూ.కోటి వ్యయంతో చేపట్టిన మోడల్ వైకుంఠధామం పనులదీ అదే పరిస్థితి. చౌరస్తా నుంచి హౌసింగ్ బోర్డు వరకు విభాగిని నిర్మాణం మిగిలి ఉంది. హౌసింగ్ బోర్డు నుంచి పెంబర్తి బైపాస్ రోడ్డు వరకు విభాగిని నిర్మాణ పనుల్లో మరో 40 శాతం మేర పూర్తి కావాల్సి ఉంది. 10, 11 వార్డుల పరిధిలో మురుగుకాల్వ నిర్మాణ పనులు ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. గుండ్లగడ్డ చిన్నమోరి మురుగునీటి మళ్లింపు ప్రతిపాదన దశను దాటడం లేదు.

టెండరు పూర్తయినా..

రూ.2 కోట్లతో నిర్మించాల్సిన ఆధునిక దోబీఘాట్ నిర్మాణానికి స్థల సేకరణ, టెండర్ల ప్రక్రియ పూర్తయింది. పనుల ప్రారంభానికి ముహూర్తం ఖరారు కాలేదు. స్థానిక తపాలా కార్యాలయం కూడలిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద రహదారి అభివృద్ధి పనులు పెండింగులోనే ఉన్నాయి. రూ.40 లక్షలతో నిర్మించాల్సిన రాత్రి బస భవన నిర్మాణానికి పునాది రాయే పడలేదు. పట్టణ ప్రగతి నిధులు సకాలంలో రాకపోవడంతో అనేక ప్రతిపాదనలు ముందుకు కదలడం లేదు.

సమీక్షించి పనులు జరిగేలా చూస్తాం

– డీఈ చంద్రమౌళి

విభాగిని పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. సెంట్రల్ లైటింగ్ విద్యుత్తు స్తంభాల ఏర్పాటు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఆర్వోబీ కింద పచ్చదనం పెంపు పనులకు టెండర్లు పూర్తయ్యాయి. నిధుల లభ్యతను అనుసరించి, అసంపూర్తి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

# చెక్‌డ్యాం నిర్మిస్తేనే నీరు నిలిచేది!




మహబూబాబాద్ : పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లి పాలేరు వాగుపై చెక్‌డ్యాం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 2019-20లో రూ.2.7 కోట్ల నిధులతో నిర్మాణానికి సర్కారు అనుమతి ఇచ్చింది. ఎప్పుడో పూర్తి చేయాల్సిన వారు..ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించారు. ఈ పనుల్ని తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలి. ప్రస్తుతం జరుగుతున్న పనుల్ని చూస్తుంటే ఈ మధ్యలోనే విస్తారంగా వానలు కురిస్తే నిలిచిపోనున్నాయి. మరల వచ్చే వేసవిలోనే పూర్తి అయ్యేలా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితే ఎదురైతే ఆ ప్రాంతంలో ఉట్టిపడే జలకళను చూడాలనుకుంటున్న ఆయకట్టు రైతులకు ఎదురుచూపులే మిగలనున్నాయి.జిల్లాలోని పాలేరు, ఆకేరు, మున్నేరు, పాకాల, వట్టి వాగులు ప్రవహి స్తున్నాయి. వీటిలో ఎల్లప్పుడూ జలకళ ఉట్టిపడేలా..ఆయకట్టు సాగునీరందేలా.. భూగర్భజలాలు పెంపొందేలా చెక్‌డ్యాం నిర్మాణానికి సర్కారు ప్రాధాన్యమిచ్చింది. 2019-20లో జిల్లాలోని వాగులపై 38 చెక్‌డ్యాంల నిర్మాణాలకు సుమారు రూ. 117 కోట్ల నిధులతో అనుమతులిచ్చింది. ఇందులో ఇరవై నిర్మాణాలకు నాబార్డు వారి సహకారాన్ని తీసుకున్నారు. ఏడాదిలోనే ముగించాల్సిన పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. కొన్ని చోట్ల ప్రారంభించలేదు. రెండేళ్లుగా వానాకాలంలో భారీ వర్షాలు కురవడంతో చాలా చోట్ల నీరు నిల్వ ఉండడంతో పనులు చేయడానికి వీలు పడలేదు. వరదలకు కొన్ని చోట్ల కోతకు గురికాగా నీటిని మళ్లించి మరమ్మతులు చేశారు. పూర్తికానివి, పనులు ప్రారంభించినవి ఈ వేసవిలోనైనా చేస్తారని భావించినా ముందడుగు పడలేదు.

పురోగతిలో ఉన్నట్లుగా..38 చెక్ డ్యాంల్లో 22 నిర్మాణాలు పూర్తైనట్లు మరో 16 పురోగతిలో ఉన్నట్లు ఆ శాఖ అధికారులు ఏప్రిల్‌లో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశపు ఎజెండా నివేదికలో పొందుపరిచారు. ఆ రికార్డు ప్రకారం వాటిని నిర్మాణం చేయాల్సిన చోట పనులే మొదలు కాలేదు. తొర్రూరు మండలంలో 8 చోట్ల నిర్మించాలనుకున్నారు. ఇందులో ఆరు మాత్రమే పూర్తయ్యాయి. చీకటాయపాలెం, కంటాయపాలెం గ్రామంలో పనులు ప్రారంభం కాలేదు. కంటాయపాలెంలో రూ.5.9 కోట్లతో 425 ఎకరాల ఆయకట్టు సాగునీరిందేలా నిర్మించాలి. పెద్దవ్వగరలో రెండింటిలో ఒకటి పూర్తికాగా..మరొకటి ఏప్రిల్‌లో మొదలు పెట్టారు. ఇంకా పూర్తి కాలేదు. ఈ మధ్యలో వర్షాలు కురిస్తే వరదతో పనులు అర్థాంతరంగా నిలిచిపోనున్నాయి. కేసముద్రం, గూడూరు మండలాల్లోనూ ఎంపిక చేసిన పనుల్లో సగం వరకు పురోగతిలోనే ఉన్నాయి.

ఇది తొర్రూరు మండలం చీకటాయపాలెం గ్రామంలోని పాలేరు వాగు. ఇందులోని వరదనీటికి అడ్డుకట్ట వేసేందుకు 2019-20 ఆర్థిక సంవత్సరంలో చెక్‌డ్యాం నిర్మించేందుకు రూ.3.966 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఆయకట్టు 350 ఎకరాలకు సాగునీరందేలా.. సమీపంలోని బోర్లు, బావుల్లో భూగర్భజలాలు వృద్ధి చెందేలా చెక్‌డ్యాం నిర్మించాలనుకున్నారు. సుమారు నాలుగేళ్లు కావొస్తున్నా ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టలేదు. ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతన్నలకు నిరాశే మిగిలింది.హడావుడిగా చేస్తే అంతే!ప్రస్తుతం చేస్తున్న పనులను వర్షాలు వస్తాయని హడావుడిగా చేస్తే నాణ్యత లోపించి విరివిగా వర్షాలు కురిస్తే చెక్‌డ్యాంలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. గుర్తూరు ఆకేరు వాగులో నిర్మించిన చెక్‌డ్యాం ప్రణాళిక ప్రకారం చేపట్టకపోవడంతో ఆశించిన స్థాయిలో నీరు నిల్వడం లేదని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొన్ని చోట్ల నిర్మాణాలకు ఆలస్యమైంది. పనుల్ని నాణ్యతతో చేపడితే పదికాలాల పాటు మన్నికతో ఉంటాయి. ఇందుకు క్షేత్రస్థాయిలో సంబంధిత జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు దగ్గరుండి పనులు చేయించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సారు.. లేరు!

కొత్తగూడెం : ప్రభుత్వ విద్యాలయాలు ప్రారంభమయ్యాయి. ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ కొనసాగుతోంది. రాత పుస్తకాలు సైతం అందజేయనున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా... ఉభయ జిల్లాల్లోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరే దారి కనిపించడం లేదు. గత ఐదేళ్లుగా ఎలాంటి నియామకాలు చేపట్టకపోవడంతో ఈ సమస్య ఎదురైంది. దీంతో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై ప్రభావం పడుతోందని 'న్యాస్', 'ప్రథమ్', 'అసర్' వంటి నివేదికలు ఇప్పటికే వెల్లడించాయి. పలువురు విద్యార్థులు కనీసం రాయడం, చదవడంలో తడబడగా.. గణిత చతుర్విధ (కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగాహారం) ప్రక్రియల్లో బాగా వెనుకబడినట్లు సర్వేల్లో తేలింది. గతంలో ఖాళీలున్న చోట వాలంటీర్లతో తరగతులు నెట్టుకొచ్చేవారు. 2019-20 సంవత్సరం నుంచి ప్రభుత్వం వీరినీ పక్కనపెట్టింది. ప్రస్తుతం సర్కారు బడుల్లో తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమాన్నీ ప్రవేశపెట్టారు. కానీ తరగతుల బోధనకు సంబంధించి విద్యార్థుల సంఖ్యకు తగినవిధంగా ఉపాధ్యాయుల్లేరు. జిల్లా స్థాయిల్లో చేపట్టదలచిన సర్దుబాటు ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు. అప్పటిదాకా ఉన్నవారితోనే




ఎలాగోలా తరగతులు నెట్టుకొచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

'ఉభయ జిల్లాల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. సబ్జెక్టు టీచర్లు లేనిచోట సమీప పాఠశాలల్లో అదనంగా ఉన్నవారిని సర్దుబాటు చేస్తున్నాం. ఇందుకోసం కలెక్టర్ల అనుమతి లభించింది. త్వరలో ప్రక్రియ పూర్తిచేస్తాం. ఏకోపాధ్యాయ పాఠశాలలతో పాటు భద్రాద్రిలో ఒక్కరూ లేని ప్రభుత్వ బడులకు ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేస్తాం. ఏ ఒక్క పాఠశాల మూతపడనివ్వం. సోమశేఖరశర్మ, డీఈఓ

# నాలుగేళ్లుగా.. ఎదురుచూపులేగా..!

సూర్యాపేట : గత పదేళ్లుగా ఆయకట్టుతో పాటు ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల బావులు, బోర్లతో వ్యవసాయానికి సాగునీరు అందిస్తున్నారు. 2001-02లో వచ్చిన కరవు తర్వాత ఆయకట్టులో 70 శాతం మంది రైతులు బోర్లు, బావులు తవ్వించారు. వీటికి మోటార్లు ఏర్పాటు చేసుకుని కొద్ది కమతంలో పంటలు పండిస్తున్నారు. ఒక వ్యవసాయ విద్యుత్తు సర్వీసు మంజూరు కావాలంటే ముగ్గురు లేదంటే నలుగురు రైతులు డీడీలు చెల్లించాలి. ఒక్కో డీడీ ప్రస్తుతం రూ.58 00లు (గతంలో రూ.4960 ఉండేది) చెల్లించాలి. ఒక్క డీడీ చెల్లిస్తే ప్రభుత్వం ఒక్క డీడీకి రూ.70 వేల రాయితీ ఇస్తుంది. ఇలా మూడు డీడీలకు రూ.2,10,000 ప్రభుత్వం నుంచి రాయితీ రూపంలో విద్యుత్తు శాఖకు అందుతుంది. ఆ డబ్బుతో రైతులకు ఒక విద్యుత్తు నియంత్రిక, ఒక డీపీ స్తంభం, ఏబీ స్విచ్, ఎస్‌జీ ఫ్యూజు, దిమ్మె, కూలీల ఖర్చు, ఎర్త్ తదితర సామగ్రి సమకూర్చుతారు. నాలుగు డీడీలు చెల్లిస్తే నియంత్రికతో పాటు అదనంగా 5 స్తంభాల మేర లైను వస్తుంది. రైతులు ఎక్కువగా నాలుగు డీడీలు చెల్లిస్తుంటారు. ఏటేటా రైతుల అవసరాలు పెరుగుతుండటంతో తదనుగుణంగా సర్వీసులు మంజూరు ఇవ్వడం లేదు. కొంతమంది రైతులు నాలుగేళ్ల క్రితం డీడీలు చెల్లించి నేటికి సర్వీసు మంజూరు, లైన్ ఏర్పాటుకు ఎదురుచూస్తున్నారు.

సకాలంలో మంజూరు ఇస్తే..

రైతులు డీడీలు చెల్లించిన వెంటనే మంజూరు ఇచ్చి నియంత్రిక ఏర్పాటు, లైన్లు వేయడం పూర్తి చేస్తే పెరిగిన భారం పడేది కాదు. ప్రభుత్వం జాప్యం చేయడంతో అది నాలుగేళ్ల తర్వాత రైతులపై పడుతుంది. సకాలంలో డీడీలు చెల్లించినా భారం పడటం అన్యాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓఆర్సీ చెల్లించినా కొంతమందికి మంజూరు రావడం లేదు. గరిడేపల్లిలో కొంతమంది రైతులు రూ.2.62 లక్షలు ఓఆర్సీ చెల్లించారు. అయినా పనులు చేయడానికి రెండు నెలలుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సి వస్తుంది. ఇలా ఉమ్మడి జిల్లాలో పది వేల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

ఓఆర్సీ చెల్లించి రెండు నెలలు

మేము కొంతమంది రైతులం కలిసి 2019 సెప్టెంబరు 24న ముగ్గురం ఒక ట్రాన్స్‌ఫార్మర్‌కు, నలుగురం మరో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏడు డీడీలు తీశాం. 2023 ఏప్రిల్‌లో రూ.2.62 లక్షలు ఓఆర్సీ కట్టాలని అధికారులు చెప్పారు. యాసంగి పంట చేతికి రావడంతో అప్పులు పోగా మిగిలిన సొమ్మును వానాకాలం పెట్టుబడికి ఉంచుకుందామనుకున్నా.. అందరు కరెంటు కోసం డబ్బులు కట్టాలంటే ఓఆర్సీ కింద ఏప్రిల్ 17న చెల్లించాం. నియంత్రిక, స్తంభాలు వేయండని అధికారులను అడిగితే టెండర్ పిలవాలని చెబుతున్నారు. సీజన్ వచ్చింది. నారుమడికైనా నీరు పెట్టుకుందామంటే మోటారుకు విద్యుత్తు లేదు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే లైను, నియంత్రిక ఏర్పాటు చేయండి.

బండ వెంకటరెడ్డి. గరిడేపల్లి

వారంలో టెండర్ పూర్తి చేస్తాం

ఓఆర్సీ ఎక్కువ ఉంటే టెండర్ పిలవాల్సి ఉంటుంది. టెండర్‌కు నోటీసు బోర్డుపై పెడుతున్నాం. వారంలో పూర్తి చేస్తాం. వెంటనే లైన్ వేయిస్తాం .వెంకటకృష్ణయ్య, డీఈ హుజూర్‌నగర్.

రైతులపై పెరిగిన భారం

రైతులు చెల్లించిన డీడీలకు ప్రభుత్వం ఎప్పటి నుంచో రూ.70 వేల రాయితీ ఇస్తుంది. 2016-17 సంవత్సరం నుంచి నియంత్రికలు, కరెంటు సామగ్రి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. 2018-19లో రూ.75 వేలు ఉన్న 25 కేవీ విద్యుత్తు నియంత్రిక ప్రస్తుతం రూ.1.20 లక్షలు అయింది. ప్రభుత్వం రాయితీ పెంచలేదు. కేవలం రూ.70 వేలు ఇస్తుంది. పెరిగిన 30 శాతం ధరాభారం రైతులపైనే పడుతోంది. ఒక్క నియంత్రిక ధరలోనే రూ.45 వేలు రైతుల చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక ఏబీ స్విచ్ ధర గతంలో రూ.6 వేలు ఉండగా ఇప్పుడు రూ.13 వేలకు పెరిగింది. అంటే రైతుపై ఏడు వేల భారం పడినట్లే. రాయితీ రూ.లక్షకు పెంచితే రైతుపై ఇంత భారం పడదు. పెరిగిన ధరలను ఓఆర్సీ పేరుతో విద్యుత్తు శాఖ వసూలు చేస్తుంది.°ఓఆర్సీ చెల్లిస్తేనే లైను వేయడం, సర్వీసు మంజూరు చేయడం చేస్తున్నారు. ఇలా ఓఆర్సీ చెల్లించిన రైతులు దాదాపు 80 శాతం మంది ఉన్నట్లు విద్యుత్తు శాఖ అధికారులు పేర్కొంటున్నారు.వ్యవసాయ విద్యుత్తు సర్వీసుల కోసం రైతులు నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నా.. మోక్షం కల్గడం లేదు. డీడీలు చెల్లించి కార్యాలయాల చుట్టూ తిరిగినా కనికరం చూపడం లేదు. ఈ లోగా నియంత్రికలు, కరెంటు సామగ్రి ధరలు 30 శాతం పెరిగినా ప్రభుత్వం ఇచ్చే రాయితీ పెరగకపోవడంతో ఆ భారమంతా రైతులపైనే పడుతోంది. భారం మోస్తున్నా.. సర్వీసు మంజూరు చేయడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# దేవాలయ భూములు కబ్జా..

సూర్యాపేట : అధికారులు, పాలకులు ఒక్కటయ్యారు. ఏకంగా దేవుడి భూములకు ఎసరు పెట్టారు. ఏళ్లతరబడి ఆక్రమిత దారుల కబంధహస్తాల్లో వేలాది ఎకరాలు బంది అయ్యాయి. నల్గొండలో పార్కునే ఏర్పాటు చేయగా.. చాలా చోట్లా సాగు చేసుకుంటున్నారు. నిబంధనలు అతిక్రమించినా కబ్జాదారులను ప్రశ్నించేవారే లేకపోవడంతో వాళ్లదే ఇష్టారాజ్యంగా మారింది. ఉమ్మడి జిల్లాలో 1450కి పైగా దేవాలయాలున్నాయి. ప్రభుత్వం గుర్తించిన 800 దేవాలయాలలో 505 దేవాలయాలకు 14650 ఎకరాల భూములున్నట్లు ఆ శాఖ అధికారులు గుర్తించారు. వీటిలో సుమారు మూడు వేల ఎకరాలను దేవాదాయశాఖ అధికారులు రైతులకు కౌలుకు ఇచ్చారు. దాదాపు 5 వేల ఎకరాలకు పైగా భూములు ఆక్రమణలో ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. మూడు వేల ఎకరాలకు పైగా భూములు సాగుకు యోగ్యం కానివి ఉన్నాయని వాళ్ల రికార్డుల్లో నమోదయ్యాయి. దేవుడి పేరుతో పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకోవడం, ఆలయ భూముల గుర్తింపుకోసం అధికారిని నియమించారు. సిబ్బంది కొరతతో సర్వే పని ముందుకు సాగడంలేదు. అనేక ఆలయాలకు చెందిన భూమి ఎక్కడ ఉందన్న విషయం ఇప్పటికీ సంబంధిత అధికారులకు తెలయట్లేదు. కళ్ల ముందు కనిపిస్తున్న భూములను సైతం స్వాధీనం చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. నల్గొండ మండలం అన్నెపర్తి గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయానికి చెందిన 13 ఎకరాల భూమి చర్లపల్లి సమీపంలో ఉంది. ఇటీవల నల్గొండ పురపాలిక అధికారులు అందులో పార్కు నిర్మించారు. దేవాలయ భూమిలో పార్కు ఏర్పాటు చేసినందుకు కనీసం లీజు ధర కూడా చెల్లించలేదు. గతంలో ఇదే భూమిని కొందరు ఆక్రమించి విక్రయించగా.. భక్తులు పోరాడి తిరిగి స్వాధీనం చేసుకున్నారు. తాజాగా అదే భూమిలో పార్కు ఏర్పాటు చేయడంతో భక్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ భూమికి పరిహారం ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వం సూచించిన విధంగా దేవాలయానికి లీజు మున్సిపాలిటీవారు చెల్లిస్తారని కలెక్టర్ చెప్పారు. అయినా.. దస్త్రం ముందుకు కదల్లేదు.పానగల్ వేంకటేశ్వరస్వామి దేవాయాలని చెందిన 34.33 ఎకరాలను కొందరు రైతులు ఆక్రమించుకుని సాగుచేస్తున్నారు. స్వాధీనం చేసుకునేందుకు స్థానికులు ప్రయత్నించారు. ఆ భూములు తమవే నంటూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎండోమెంట్ ట్రైబ్యునల్ విచారించి ఆ భూమి ఆలయానిదేనంటూ తీర్పు ఇచ్చింది. అయినా.. అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకోవడానికి ముందుకు రావడంలేదని భక్తులు వాపోతున్నారు. చందంపేట మండలం చిత్రీయాలలోని మహాంకాళి దేవాలయానికి సుమారు 200 ఎకరాలకు పైగా దేవాలయ భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదైంది. కానీ.. ఆ భూమి ఎక్కడ ఉందో అధికారులు గుర్తించకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతుంది.

# తునికాకు సేకరణ.. డబ్బులకు నిరీక్షణ

ములుగు: తునికాకు సేకరణ జరిగి 20రోజులైనా కూలీలకు డబ్బులు అందలేదు. కూలి కోసం పేద కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. గతంలో ఏ రోజు కూలి ఆ రోజే ఇచ్చే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఆకు సేకరణ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు కూలీలకు నయా పైసా చెల్లించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. తునికాకు సేకరణ చరిత్రలోనే ఇంత వరకు ఇలాంటి దుస్థితి ఎదురుకాలేదని కూలీలు చెబుతున్నారు.

ఆన్‌లైన్‌లో చెల్లించాలని..

తునికాకు సేకరణకు ఈ సారి కొత్త పద్ధతిని అటవీశాఖ ప్రవేశపెట్టింది. గతంలో కూలీలు సేకరించిన తునికాకు కూలి డబ్బులు చేతికి ఇచ్చేవారు. ఈ ఏడాది బ్యాంక్ ఖాతాలో ఆన్‌లైన్ ద్వారా జమ చేయాలని నిర్ణయించారు. అయితే ఇది సక్రమంగా అమలు చేయకపోవడంతో



దీని ప్రభావం కూలీలపై పడి, ఇబ్బందులు తప్పడం లేదు. వివరాలు ట్యాబ్‌లో నమోదు చేసి అదే రోజు కూలి డబ్బులు ఖతాలో జమ చేయాల్సి ఉంది. సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపాల కారణంగా, ట్యాబ్‌లు సరిగా పని చేయకపోవడం, కూలీల వివరాలు సరిగా నమోదు కాకపోవడం లాంటి కారణాలతో అటవీ శాఖ ప్రవేశపెట్టిన నూతన పద్ధతి ఆచరణకు నోచుకోలేదు. సమస్యను పరిష్కరించకుండా.. చేతికి డబ్బులు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

11,735 ఎస్బీల ఆకు సేకరణ

జిల్లాలో ఏటూరునాగారం వైల్డ్‌లైఫ్, ములుగు, తాడ్వాయి, వెంకటాపురం అటవీ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 18,800 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఆయా యూనిట్లలో ఆకు సేకరణకు అటవీ శాఖ పలుమార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ఆసక్తి చూపలేదు. దీంతో చాలా యూనిట్లకు టెండర్లు కాలేదు. ఫలితంగా లక్ష్యం మేరకు ఆకు సేకరణ జరగలేదు. ఈ ఏడాది మే 1న ప్రారంభమైన తునికాకు సేకరణ అదే నెల 30 వరకు జరిగింది. 11,735 స్టాండర్డ్ బ్యాగ్ (ఎస్బీ)లు సేకరించారు. ఒక కట్టలో 50 తునికాకులు ఉంటాయి. వెయ్యి కట్టలను ఒక స్టాండర్డ్ బ్యాగ్‌గా లెక్కిస్తారు. ఒక కట్టకు ప్రభుత్వం రూ.3 కూలి చెల్లిస్తుంది. ఈ లెక్కన సేకరించిన తునికాకు కోసం కూలీలకు రూ.3.52 కోట్లు చెల్లించాల్సి ఉంది. కూలీలు బీట్, సెక్షన్, రేంజి అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. రేపు మాపు అంటూ కాలం గడుపుతున్నారు.

ఎప్పుడు అడిగినా మూడ్రోజులంటున్నారు..

– బయ్యి పుష్పలీల, నర్సింగాపూర్, తాడ్వాయి మండలం

మాది ఉమ్మడి కుటుంబం. అందరం కలిసి సుమారు రూ.35 వేల విలువ చేసే ఆకు సేకరించాం. కూలి డబ్బులు ఇంకా రాలేదు. ఎప్పుడు అడిగినా మూడు రోజులు అంటున్నారు. 20 రోజులైనా ఇదే పరిస్థితి. కుటుంబం గడవడం కష్టంగా ఉంది.

సేకరణకు ఎంతో కష్టపడ్డాం..

– భూపతి పూల, నర్సింగాపూర్, తాడ్వాయి మండలం

మా కుటుంబమంతా కలిసి సేకరించిన ఆకుకు రూ.18 వేల వరకు కూలి డబ్బులు రావాల్సి ఉంది. వర్షాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో కూలి డబ్బులు వస్తే వ్యవసాయ ఖర్చులు తీరుతాయనుకున్నాం. వేసవిలో రెండు నెలలుగా ఎలాంటి పని లేక ఆకుసేకరణకు వెళ్లాం. అడవిలో అష్టకష్టాలు పడ్డాం. కొత్త పద్ధతి పెట్టి కూలి చెల్లింపులో జాప్యం చేస్తున్నారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలు

గంభీరావుపేట : జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీగా పురస్కారం అందుకున్న గంభీరావుపేటకు తాజాగా ఐఎస్‌వో గుర్తింపు లభించింది. అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా ప్రజలకు సౌకర్యాలు కల్పించినందుకు గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీకి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్‌వో) గుర్తింపు ఇచ్చారు. ఈ మేరకు ఈ నెల 15న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా సర్పంచి శ్రీధర్ పంతులు ఐఎస్‌వో 9001:2015 సర్టిఫికెట్ అందుకున్నారు. ఐఎస్‌వో గుర్తింపు రావడంతో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఈ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సహకారం అందించే అవకాశం ఉంటుంది.

గుర్తింపునకు దోహదపడిన అంశాలు... రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గంభీరావుపేటలో కేజీ టు పీజీ క్యాంపస్ ఉంది. పలకతో వచ్చి పట్టాతో వెళ్లే విధంగా అన్ని సౌకర్యాలతో ఈ విద్యాలయాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కేవలం గ్రామ పంచాయతీ నిధులతో ప్రణాళికాబద్ధంగా గ్రామంలో దాదాపు 95 శాతం సీసీ రోడ్లను నిర్మించారు. అదేవిధంగా 90 శాతం మురుగు కాలువలను నిర్మించి స్వచ్ఛతకు బాటలు వేశారు. వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు.

గంభీరావుపేటలో డిజిటల్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పోటీ పరీక్షల నేపథ్యంలో నిరుద్యోగులకు ఇది బాగా ఉపయోగపడుతుంది.

గ్రామ పంచాయతీకి వచ్చే ప్రజలను ఇబ్బంది పెట్టకుండా పౌర సేవలను ఎప్పటికప్పుడు అందిస్తున్నారు.

ప్రజలకు అత్యంత అవసరమైన తాగు నీటిని సమస్య లేకుండా సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ నీరు రాని సమయంలో సైతం బోర్లు, బావుల ద్వారా ప్రజలకు నీటిని అందిస్తున్నారు. ఇటీవల గంభీరావుపేటకు జాతీయ స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ పురస్కారం రావడం కూడా ఐఎస్‌వో గుర్తింపునకు దోహదం పడింది.

బాధ్యత మరింత పెరిగింది

ఇటీవల జాతీయ స్థాయిలో గంభీరావుపేట ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైంది. ప్రస్తుతం ఐఎస్‌వో గుర్తింపు రావటంతో బాధ్యతలు పెరిగాయి. గంభీరావుపేటను మరింత అభివృద్ధి చేస్తాం. త్వరలోనే గాంధీచౌక్ వద్ద సమీకృత మార్కెట్ యార్డును నిర్మించి ప్రజల ఇబ్బందులను తొలగిస్తాం. పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తాం. శ్రీధర్ పంతులు, సర్పంచి

# ఇంటింటా.. కంటి వెలుగు



భూపాలపల్లి : కంటి చూపు సరిగా లేని వారి ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.. చాలా మంది పేద, మధ్య తరగతి ప్రజలు ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకునే స్తోమత లేకపోవడం.. చిన్న సమస్యే కదా తగ్గుతుందిలే అనే నిర్లక్ష్యం కారణంగా చూపును కోల్పోయే వరకు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పరీక్షలు చేయించేందుకు ముందుకొచ్చింది. కళ్లద్దాల పంపిణీ, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తామని ప్రకటించింది. గత జనవరి 18వ తేదీన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీంతో శిబిరాలకు పట్టణాలు, గ్రామాల నుంచి మంచి స్పందన వచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 19.06 లక్షల మందికి కంటి పరీక్షలు చేశారు.

198 బృందాలు... 100 పని దినాలు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని జనవరి 18 నుంచి 100 పని దినాల్లో అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి ఒక్కరికి నేత్ర శిబిరాలపై అవగాహన కల్పించారు. శిబిరాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 198 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ విజయవంతంగా ముందుకెళ్లారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రతి రోజు సుమారు 100 మందికి తగ్గకుండా కంటి పరీక్షలు చేశారు. ప్రతి బృందంలో ఒక వైద్యాధికారి, ఒక ఆప్టోమెట్రిస్ట్, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, ముగ్గురు ఆశా కార్యకర్తలు సేవలు అందించారు.

19.06 లక్షల మందికి పరీక్షలు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో 1,707 గ్రామ పంచాయతీలు, 303 మున్సిపల్ వార్డుల్లో 19.06 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. రీడింగ్ అద్దాలు 2,82,041 మందికి, దూరపు చూపు అద్దాలు 1,66,777 మందికి పంపిణీ చేశారు. ఇంకా 28,817 మందికి దూరపు చూపు అద్దాలు అందాల్సి ఉంది. విడతల వారీగా పంపిణీ చేస్తున్నామని సంబంధిత వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే 14.29 లక్షల మందికి ఎలాంటి నేత్ర సమస్యలు లేవని తేలింది. శస్త్రచికిత్సలు అవసరం ఉన్నవారి వివరాలను నమోదు చేసుకుంటున్నామని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటామని వైద్యాధికారులు చెప్పారు.

విజయవంతంగా పూర్తి– ధనసరి శ్రీరామ్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి, భూపాలపల్లి

నేత్ర సంబంధిత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన కంటి వెలుగు శిబిరాలకు మంచి స్పందన వచ్చింది. వంద శాతం కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాల పంపిణీ చేపట్టాం. స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయడం ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాం.

# అమ్మో.. జవాన్లు వస్తున్నారు!



వరంగల్ : ప్రైవేటు శానిటరీ జవాన్లు ప్రజారోగ్య విభాగాన్ని శాసిస్తున్నారు. డివిజన్లలో సామంత రాజుల్లా వ్యవహరిస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లను డమ్మీ చేసి పెత్తనం చెలాయిస్తున్నారు. పనిచేసేది తక్కువ.. వసూళ్లలో ముందంజలో ఉంటున్నారు. ఏళ్ల తరబడి అవే డివిజన్‌లలో పాతుకుపోయిన వీరు రాజకీయ అండదండలతో అంతర్గత బదిలీలు జరగకుండా అడ్డుకుంటున్నారు. అనధికారికంగా ట్రేడ్ లైసెన్సు ఫీజులు, యూజర్ ఛార్జీలు వసూలు చేస్తూ బల్దియా ఆదాయానికి గండి కొడుతున్నారు. హోటళ్లు, తినుబండారాలు, బేకరీలు, బిర్యానీ సెంటర్లు, అల్పాహార కేంద్రాలు తదితరాల నుంచి నెలవారీ వసూళ్లు చేపడుతున్నారు. ఆదివారం, పండగల సమయాల్లో ఉచితంగా మటన్, చికెన్, చేపలు తీసుకెళ్తున్నారు. ప్రైవేటు పారిశుద్ధ్య కార్మికుల నుంచి నెలవారీ కమీషన్లు దండుకుంటున్నారు. బయోమెట్రిక్ అటెండెన్సు వేసి పనికి డుమ్మా కొట్టే వారి నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారు. నెలవారీ ఆదాయం పెరగడంతో శానిటరీ జవాన్ పోస్టులకు గిరాకీ పెరిగింది.

డివిజన్‌కు ముగ్గురు, నలుగురు

నగరంలో 66 డివిజన్లు ఉండగా శానిటరీ జవాన్లు 250 మందికి పైగా ఉన్నారు. నిబంధనల ప్రకారం డివిజన్‌కు ఒకరు లేదా ఇద్దరు జవాన్లు ఉండాలి. డివిజన్లలో పరిశీలిస్తే ముగ్గురు, నలుగురు పనిచేస్తున్నారు. గతంలో ప్రభుత్వ జవాన్లు 30 మంది, ప్రైవేటు వారు 90 మంది పనిచేసే వారు. నాలుగైదేళ్లుగా పరిశీలిస్తే ప్రైవేటు జవాన్ల సంఖ్య పెంచేశారు. రాజకీయ సిఫార్సులకు తలొగ్గి పారిశుద్ధ్య కార్మికులను జవాన్లుగా నియమించారు.

మూడేళ్ల క్రితం 452 మంది తాత్కాలిక కార్మికులను విధుల్లోకి తీసుకున్నారు. ఇందులో 150– 180 మంది వైట్ కాలర్లు ఉన్నారు. వీరు పారిశుద్ధ్య పనులు చేయకుండా అనధికారిక జవాన్లుగా చలామణి అవుతున్నారు. సుమారు 250 మంది వరకు పనిచేయకుండానే జీతం తీసుకుంటున్నారు.

ఇవిగో సాక్ష్యాలు..

వరంగల్ పిన్నా వారి వీధిలో నూతన ట్రేడ్ లైసెన్సు ఫీజుల మదింపు పేరుతో దుకాణం కొలతలు తీసుకున్నారు. పన్ను తక్కువ చేస్తామని ఐదారుగురు వ్యాపారుల నుంచి రూ.3–5 వేలు తీసుకున్నారు. ఇంతవరకు లైసెన్సులు ఇవ్వలేదు. వరంగల్ జేపీఎన్ రోడ్, మండి బజారు, స్టేషన్ రోడ్, పోచమ్మ మైదాన్, పాపయ్యపేట తదితర ప్రాంతాల్లో బిర్యానీ కేంద్రాల నుంచి నెలకు రూ.2వేల చొప్పున జవాను వసూలు చేస్తున్నాడు. నలుగురు జవాన్లు బృందంగా ఏర్పడి నగరంలోని పలు ప్రాంతాల్లో శుద్ధిజల ప్లాంట్ల నుంచి నాలుగు నెలలుగా మామూళ్లు వసూలు చేస్తున్నారు. వరంగల్ ప్రాంతంలో ఇద్దరు జవాన్లు ప్రధాన రహదారుల్లో చిరు వ్యాపారుల నుంచి వారాంతపు మామూళ్లు వసూలు చేస్తున్నారు. హనుమకొండ ఏనుగులగడ్డ, చౌరస్తా, పాత మున్సిపల్ కార్యాలయం స్థలంలో చిరు వ్యాపారుల నుంచి జవాన్లు అనధికారికంగా నెలవారీ అద్దెలు వసూలు చేస్తున్నారు. కాజీపేట ప్రధాన రహదారుల్లోని హోటళ్లు, తినుబండారాలు, బిర్యానీ కేంద్రాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. పాతబస్తీ ప్రాంతంలో ఐదారుగురు జవాన్లు కార్మికుల నుంచి నెలకు రూ.400– రూ.500 చొప్పున నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. డబ్బులివ్వకపోతే విధులకు రానట్లు నమోదు చేస్తున్నారు. 452 కార్మికులు పనిచేయకున్నా వారికి నెల నెలా పూర్తి హాజరు వేస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.3–4వేలు తీసుకుంటున్నారు. పలు డివిజన్ల ప్రభుత్వ పీహెచ్ ఉద్యోగుల స్థానంలో బదిలీ వర్కర్‌తో పనులు చేయిస్తున్నారు. నెలకు రూ.5వేల మామూళు చేతులు మారుతున్నాయి. వరంగల్ వ్యాపార కూడలిలో ఓ ప్రజాప్రతినిధి బంధువు అని చెప్పి శానిటరీ జవాన్ వ్యాపారులపై జులుం ప్రదర్శిస్తున్నాడు. ఓ శానిటరీ సూపర్‌వైజర్ పేరుతో ముగ్గురు, నలుగురు జవాన్లు బృందంగా ఏర్పడి ప్లాస్టిక్ వ్యాపారుల నుంచి నెలకు రూ.2–3వేలు వసూలు చేస్తున్నారు.

# ఆదాయం తగ్గుతోంది!!




వరంగల్ : పరకాల వ్యవసాయ మార్కెట్ ఆదాయం తగ్గుతూ వస్తోంది. మార్కెట్ విభజనతో మండలాల సంఖ్య తగ్గిపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీని పరిధిలో ప్రస్తుతం పరకాల, నడికూడ, శాయంపేట మండలాలున్నాయి. పరకాలలో మార్కెట్ కార్యాలయం, శాయంపేటలో సబ్ మార్కెట్ యార్డు ఉంది. గతంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన భూపాలపల్లి, రేగొండ, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలు మార్కెట్ పరిధిలో ఉండేవి. ఇక్కడి మార్కెట్‌ను విభజించి రెండేళ్ల కిందట భూపాలపల్లి, చిట్యాలలో నూతనంగా కార్యాలయాలను ప్రారంభించారు. పరకాలలో బహిరంగ వేలం ద్వారా పత్తిని కొనుగోలు చేస్తుండగా, స్థానికంగా మూడు పత్తి జిన్నింగ్ మిల్లులున్నాయి. మూడు మండలాల్లో కలుపుకుని ధాన్యం మిల్లులు 10కిపైగా ఉండగా పీఏసీఎస్, ఐకేపీ, ఎఫ్‌సీఐల ద్వారా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో వడ్లు, మక్కలు, కందులు కొనుగోలు చేస్తున్నారు. ఈ కొనుగోళ్లతో జరిగిన వ్యాపారాల్లో ఒక శాతాన్ని మార్కెట్ ఫీజుగా చెల్లిస్తున్నారు.

అకాల వర్షాలతో..

గతేడాది రూ. 4 కోట్ల లక్ష్యానికి కేవలం రూ. 3.50 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది. ఆదాయం తక్కువ రావడంతో ఈ ఏడాది లక్ష్యాన్ని రూ. 3.50 కోట్లకు చేర్చారు. మార్చి 31 నాటికి కేవలం రూ. 2.77 కోట్లకు మాత్రమే వచ్చింది. వాస్తవంగా అకాల వర్షాలతో పంట దిగుబడులు చాలా వరకు తగ్గిపోవడంతో ఆదాయం ఆశించిన రీతిలో రాలేదు. తెల్ల బంగారం కొనుగోళ్ల ద్వారా గతేడాది రూ. 95.30 లక్షల ఆదాయం లభిస్తే ఈసారి రూ. 77.51 లక్షలకు పడిపోయింది. ధాన్యంతో గతేడాది రూ. 2.39 కోట్లు అందగా ఈసారి రూ. 1.84 కోట్లకు చేరింది. తగ్గింది వాస్తవమే– జిన్నారపు జీవన్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి

ఇటీవల పరకాల వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా విధుల్లో చేరాను. ఈ ఏడాది ఆదాయం కొంత తగ్గింది వాస్తవమే. అకాల వర్షాలకు మొక్కజొన్న, వరి, పత్తి పంటలు దెబ్బతినడమే అందుకు కారణంగా తెలిసింది.

# పార్కింగ్‌కు వెళ్లే దారేదీ?

వేములవాడ : దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తుల వాహనాలు ఆలయ పార్కింగ్ స్థలానికి వెళ్లేందుకు ముప్పు తిప్పలు పడాల్సి వస్తోంది. రోజూ స్వామివారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి వాహనాలపై భక్తులు వేలాదిగా వస్తుంటారు. వీరి ఆలయ పార్కింగ్ స్థలానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఇటీవల కట్ట కింద బస్టాప్ నుంచి కూడలి వరకు రోడ్డు అభివృద్ధి చేసి తారు వేశారు. రహదారిని అభివృద్ధి చేసిన అధికారులు భక్తుల వాహనాలు పార్కింగ్‌కు వెళ్లేందుకు ఆలోచన చేయకపోవడంతో పార్కింగ్‌కు ఎలా వెళ్లాలో తెలియని దుస్థితి ఏర్పడింది.

రాజన్న ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలు పార్కింగ్ స్థలానికి వెళ్లేందుకు గోశాల ఎదురుగా కట్టపైకి ఎక్కి పార్కింగ్‌కు ప్రవేశం ఉన్నప్పటికీ అది ఇరుకుగా ఉంది. దీంతో ఒక వాహనం వెళ్తే మరో వాహనం రాని పరిస్థితి ఏర్పడింది. ఈ దారిలో మధ్యలోకి వచ్చిన వాహనాలు వెనక్కి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. గత్యంతరం లేక భక్తులు ఇదే దారిలోంచి పార్కింగ్ స్థలానికి అతి కష్టం మీద రాకపోకలు సాగిస్తున్నారు. అయినా వీరి బాధలు తీర్చేందుకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై భక్తుల నుంచి నిరసన వ్యక్తమవుతుంది.

గుడి చుట్టూ తిరుగుతూ...

పార్కింగ్‌కు వెళ్లేందుకు సరైన దారి లేక భక్తులు నానా తంటాలు పడుతున్నారు. రోజూ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు పార్కింగ్



స్థలానికి వాహనాలు వెళ్లే మార్గం తెలియక చాలా వాహనాలు పట్టణంలోకి వస్తున్నాయి. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడి భక్తులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కట్ట కింద బస్టాండ్ నుంచి వచ్చే భక్తుల వాహనాలు గోశాల వద్ద నుంచి చిన్నపాటి రోడ్డులోంచి వెళ్లేందుకు దారి తెలియక సరాసరి పట్టణంలోకి వస్తున్నాయి. ఆలయ ప్రధాన రోడ్డు నుంచి అంబేద్కర్ కూడలి, భీమేశ్వరాలయం, వీఐపీ రోడ్డు మీదుగా పార్కింగ్ స్థలానికి వెళ్లాల్సి రావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ముందే ఇరుకు రోడ్లు. దీంతో భక్తుల వాహనాల రాకపోకలకు ఆలయ పరిసరాల్లో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ప్రస్తుతం రాజేశ్వరపురం శిథిల వసతి గదులను కూల్చివేసే పనులు కొనసాగుతుండటంతో ఆ దారిని మూసి వేశారు. దీంతో ప్రతి వాహనం భీమేశ్వరాలయం రోడ్డు మీదుగా పార్కింగ్ ప్రాంతానికి చేరుకోవాల్సిన దుస్థితి భక్తులను ఆవేదనకు గురిచేస్తోంది.

అధికారులు స్పందిస్తేనే...

గుడి కట్ట కింద రోడ్డు నుంచి పార్కింగ్ స్థలం వైపు ర్యాంపు నిర్మాణంతో ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది. లేకుంటే భక్తులకు తిప్పలు ఇలాగే కొనసాగే పరిస్థితి ఉంది. స్వామివారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు ఎక్కువగా పట్టణంలోని రెండు బైపాస్ రోడ్ల మీదుగా ఆలయానికి వస్తుంటారు. వీరంతా గుడి కట్ట బండ్ ప్రాంతం నుంచి ఆలయ పార్కింగ్‌కు చేరుకుంటారు. ప్రతి సోమ, ఆది, శుక్ర వారాల్లో వేలాదిగా వాహనాలు వస్తుంటాయి. వీరి ఇబ్బందులు కట్ట వద్ద ర్యాంపు, రోడ్డు నిర్మాణంతోనే తొలగనున్నాయి. ఆ దిశగా ఆలయ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు

కట్ట కింద రోడ్డు నుంచి పార్కింగ్ ప్రాంతానికి భక్తుల వాహనాలు వచ్చేందుకు ర్యాంపు, రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. రూ. 7 లక్షలతో ర్యాంపు నిర్మాణంతో పాటు పార్కింగ్ స్థలంలోని జల ప్రసాదం వరకు మట్టి రోడ్డు నిర్మాణం, రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడానికి అగ్రిమెంట్ పూర్తయింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం ఈ పని చేయడం జరుగుతుంది. రఘునందన్, డీఈ, రాజన్న ఆలయం

# మొక్కవోని దీక్షకు వరించిన పురస్కారం

సూర్యాపేట : సూర్యాపేట పురపాలిక హరితహారంలో మరో పురస్కారాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే ఆర్‌ఆర్‌ఆర్ నిర్వహణ, మహాప్రస్థానం, సమీకృత మార్కెట్ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అవార్డులు అందజేసింది. తాజాగా హరితహారానికి ప్రకటించడంతో ఒక్క నెలలోనే మూడు పురస్కారాలు దక్కడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ప్రదానం

జిల్లాకేంద్రంలో పట్టణ ప్రకృతి వనాలు, బృహత్ పట్టణ ప్రకృతి వనాలు, ట్రీ పార్కులు, అవెన్యూ ప్లాంటేషన్, చిట్టడవులు ఏర్పాటు చేసి పచ్చదనాన్ని పెంపొందించినందుకు ప్రభుత్వం రాష్ట్రస్థాయి పురస్కారాన్ని ప్రకటించినట్లు మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం జరగనున్న సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అవార్డు స్వీకరించనున్నట్లు చెప్పారు.

పచ్చదనం పోషణ ఇలా..

సూర్యాపేటలోని 12 నర్సరీల్లో 32,54,647 మొక్కలు, బృహత్ ప్రకృతి వనాల్లో 9,460, అవెన్యూ ప్లాంటేషన్‌లో 4,90,629, మీడియన్ ప్లాంటేషన్ కింద 63,416, మల్టీ లేయర్ అవెన్యూ ప్లాంటేషన్ కింద 11,000, మొత్తం 49 పార్కులలో 98,004 మొక్కలు పెంచారు. గతేడాది ఇంటింటికీ 17,56,125



పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. పచ్చదనం పోషణకు అధికారులు విశేషంగా కృషి చేస్తున్నారు. వేసవిలో నాటినవి ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీటినందించి సంరక్షిస్తున్నారు. కొత్తబస్టాండ్, తపాలా కార్యాలయం, తాళ్లగడ్డ, చర్చికాంపౌండ్, పీఎస్‌ఆర్ సెంటర్‌లోని విభాగినుల మధ్యలో మొక్కలు నాటారు. కాలనీల్లోనూ నాటి సంరక్షణ బాధ్యతలు చేపడుతున్నారు. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి ఆకర్షణీయంగా మారాయి. వీటితో సూర్యాపేట పచ్చందాలను తలపించడంతో రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపికైంది. హరిత సూర్యాపేటగా తీర్చిదిద్దుతాంహరిత సూర్యాపేటగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం. సిబ్బంది సమష్టి కృషితో హరితహారంలో పురపాలికకు రాష్ట్రస్థాయి పురస్కారం వచ్చినందుకు సంతోషంగా ఉంది. అవార్డు రాకతో పచ్చదనం పెంపుపై మరింత బాధ్యత పెరిగింది. రామాంజులరెడ్డి, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేట

# ఉచిత బస్సు ఎవరికో?

మంచిర్యాల : స్వాతంత్ర్య వజ్రోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక కార్యక్రమానికి నాంది పలికింది. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15)రోజు జన్మించిన వారందరికి ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణం చేసేందుకు అవకాశం కల్పిస్తోంది. ఆయా లబ్ధిదారులు 12 ఏళ్లు వచ్చే వరకు రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా ఎలాంటి ఛార్జీ చెల్లించకుండా వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా దాదాపు నాలుగువేల మంది గర్భిణులు ప్రసవానికి సిద్ధంగా ఉండగా ఈ నెల 15న (24గంటలు)ఎంతమంది ప్రసవం అవుతారనేది మరో నాలుగురోజుల్లో తేలనుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులని తేడా లేకుండా ఎక్కడ జన్మించినా ఈ లబ్ధి చేకూరనుంది.



ఎంతమందికి వర్తిస్తుందో..సాధారణంగా గర్భిణులు 36-40 వారాల మధ్య ప్రసవం అవుతారని ప్రసూతి వైద్యనిపుణులు చెబుతున్నారు. 36 వారాలు నిండిన తర్వాత ఎప్పుడైనా నొప్పులు రావచ్చని, వచ్చినా ప్రసవం చేయాల్సిన అవసరం ఉంటుందని చెబుతుండగా 40 వారాలు దాటితే మాత్రం కచ్చితంగా చేయాల్సిందేనంటున్నారు. అది సాధారణమైనా, శస్త్రచికిత్స ద్వారానైనా చేయాలి. ప్రస్తుతం ప్రతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నెలకు 950-1000 ప్రసవాలు అవుతుండగా ప్రతిరోజు 30-35 జరుగుతున్నాయి. ఈ లెక్కలు చూస్తే ఆగస్టు 15న జిల్లాకు 30 చొప్పున 120 మందికి పైగా ఆర్టీసీ అందుబాటులోకి తీసుకొచ్చిన లబ్ధి పొందనున్నారు. ఈ ఉచిత ప్రయాణంతోపాటు స్వాతంత్ర్య దినోత్సవం అనేది ప్రత్యేక రోజు కావడంతో మరికొంతమంది ఈ తేదికే ఆసక్తి చూపించే అవకాశం కనిపిస్తుంది. ఎంతమందికి లబ్ధి జరుగుతుందో తెలియాలంటే వచ్చే వారం వరకు వేచిచూడాల్సిందే.

ఆరున్నర ఏళ్లలో సగం డబ్బులు ఆదా..

ఆర్టీసీ ఇచ్చిన ఈ అవకాశంతో 15వ తేదిన జన్మించిన చిన్నారులకు దాదాపు ఆరున్నర ఏళ్ల పాటు లబ్ధి జరగనుంది. ప్రస్తుతం పుట్టిన దగ్గర నుంచి నాలుగున్నర సంవత్సరాలు వచ్చే వరకు పూర్తి ఉచితంగా ప్రయాణం చేస్తుండగా ఆ తర్వాత నుంచి 12వ ఏటా వచ్చే వరకు టికెట్ ధరలో సగం (హాఫ్ టికెట్) మాత్రమే అందిస్తున్నారు. 12 ఏళ్లు రాగానే యథావిధిగా పూర్తి టికెట్ ధర చెల్లించాల్సిందే. కాగా ప్రస్తుతం అందుబాటులోకి తీసుకొస్తున్న ఈ కార్యక్రమంతో లబ్ధిదారులకు సగం డబ్బులు ఆదా కానున్నాయి.

జాగ్రత్తలు తీసుకుంటాం

డా.హరిశ్చంద్రారెడ్డి, జీజీహెచ్ పర్యవేక్షణాధికారి

ఆసుపత్రిలో ప్రసవమైన సమయాన్ని వెంటనే నమోదు చేయిస్తున్నాం. 15న జన్మించిన చిన్నారులందరికి ఆర్టీసీ ప్రత్యేక కానుక అందించడంతో మరింత జాగ్రత్తలు తీసుకుంటూ తేది, సమయాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రసవానికి వచ్చే గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు, పడకల సమస్యలు లేకుండా చూస్తాం.

లబ్ధి చేకూరుతుంది

వి.రవీంద్రనాథ్, ఆర్టీసీ డీఎం, మంచిర్యాల

ఉన్నతాధికారులు ప్రకటించిన విధంగా ఈ ఏడాది ఆగస్టు 15వ తేదిన జన్మించిన చిన్నారులందరికి ఉచిత ప్రయాణానికి సంబంధించిన లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రి అనే తేడా లేకుండా స్వాతంత్ర్య దినోత్సవం రోజున పుట్టిన వారందరికి వర్తిస్తుంది. తొమ్మిది నెలలు పూర్తిచేసుకుని ఈడీడీ(ఎస్టిమేట్ డెలివరీ డేట్) ఈ నెలలో ప్రసవమయ్యే అవకాశం ఉన్న గర్భిణుల వివరాలు ఇలా..

## స్థలం లేక.. పనులు పూర్తికాక

ఆసిఫాబాద్: జిల్లా వ్యాప్తంగా గ్రామీణ క్రీడాకారులకు కనీస మౌలిక వసతులు కల్పించి మరుగున పడిన మెరికల్లాంటి క్రీడాకారులను వెలుగులోకి తేవాలనే లక్ష్యంతో చేపట్టిన తెలంగాణ గ్రామీణ క్రీడాప్రాంగణాల నిర్మాణపనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఊరూరా క్రీడామైదానాలు నిర్మించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ దిశగా పనులు ముందుకు సాగడంలేదు. భూముల కొరతే ప్రధాన సమస్యగా మారినట్లు అధికారులు పేర్కొంటుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో వర్షాకాలం ప్రారంభమై హరితహారం లాంటి పనుల ఒత్తిడితో పనులు చేయడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ భూముల్లేక అవస్థలు..

గ్రామాల్లో క్రీడాప్రాంగణాలను నిర్మించేందుకు అవసరమైన ప్రభుత్వ భూములు లభించకపోవడంతో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీల జనాభా ఆధారంగా అర ఎకరం, ఎకరం భూమి ఉంటే అందులో క్రీడాప్రాంగణాన్ని నిర్మాణం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించగా.. అందుకు అనుగుణంగా ఉండే భూములు దొరకడం లేదు. మరికొన్ని ప్రాంతాల్లో ప్రజావ్యతిరేకత వ్యక్తమవడంతో గుర్తించిన భూముల్లో పనులు చేయడం లేదు. మరికొన్నింటిలో వర్షాల ప్రభావంతో పనులు నిలిపివేసి హరితహారం పనులు కొనసాగిస్తున్నారు. పలు ప్రాంతాల్లో గ్రామాలకు దూరంగా భూమిని గుర్తించడంతో క్రీడాకారులకు ఉపయోగపడకుండా పోయే అవకాశం ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మంచిర్యాల నియోజకవర్గం హాజీపూర్ మండలంలోని దొనబండలో తొలుత భూమిని గుర్తించగా.. ఆ భూమిని దళితులకు కేటాయించాలనే డిమాండ్లు వచ్చాయి. మరో ప్రాంతంలో స్థలాన్ని ఎంపిక చేసినా పనులు ప్రారంభించలేదు. గఢ్‌పూర్, నాగారం, ర్యాలీ, చిన్నగోపా ల్‌పూర్, పడ్తనపల్లి గ్రామాల్లోనూ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.

చెన్నూరు నియోజకవర్గంలోని చెన్నూరు మండలంలో 41 గ్రామాల్లో క్రీడాప్రాంగణాలు నిర్మించాలని నిర్ణయించిన అధికారులు ఇంతవరకు 33 గ్రామాల్లోనే భూములు గుర్తించారు. వీటిలో 24 గ్రామాల్లోనే పనులు ప్రారంభించారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని కాసిపేట మండలంలో 55 క్రీడాప్రాంగణాలు నిర్మించాలని నిర్ణయించిన అధికారులు 47 ప్రాంగణాలకు భూసేకరణ చేశారు. కేవలం నాల్గింటిని పూర్తిచేశారు. మిగతా గ్రామాల్లో పనులు వివిధ కారణాలతో నత్తనడకన కొనసాగుతున్నాయి.

వర్షాల కారణంగా పనుల్లో జాప్యం

శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, మంచిర్యాల.

# ఆరోగ్యంపై అశ్రద్ధ.. వైద్యం మిథ్య



ఆదిలాబాద్ : జిల్లాలో వసతిగృహాలు, కస్తూర్బాలు, ఆశ్రమోన్నత పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై అశ్రద్ధ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. తాజాగా చోటుచేసుకున్న ఘటనలే దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఎడతెరపి లేని వర్షాలతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 'న్యూస్‌టుడే' బృందం వసతిగృహాలను సందర్శించింది. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థుల్లో చాలామందిని మొహర్రం, రాఖీ పండగల పేరుతో ఇంటికి పంపించడం కనిపించింది. జిల్లాలో గిరిజన, షెడ్యూలు కులాల, బీసీ సంక్షేమ వసతిగృహాలతో పాటుగా కస్తూర్బా విద్యాలయాలున్నాయి. గురుకుల వసతి విద్యార్థుల పరిస్థితిని మినహాయిస్తే ఇతర వసతిగృహాల్లో చదువుకుంటున్న వారి పరిస్థితి మరీ దయనీయంగా మారింది. జలుబు చేసినా, వాంతి చేసుకున్నా జ్వరం వచ్చినా చేయి పట్టి పరీక్షించే వారు కరవయ్యారు. కస్తూర్బాల్లో ఏఎన్ఎంలు అందుబాటులో ఉన్నా బాలికలు ఉండే ఆ విద్యాలయాలకు వైద్యులు వెళ్లడం లేదు. ఫలితంగా వారు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇతర వసతిగృహాల్లో ఆరోగ్య సిబ్బంది లేకపోవడంతో వార్డెన్లు, వసతిగృహ అధికారులే ఆరోగ్య కార్యకర్తలుగా మారి తమకు తెలిసిన మాత్రలిచ్చి మమ అనిపిస్తున్నారు.

దోమలకు ఆవాసం..ఇది ఇంద్రవెల్లి మండలం ముత్నూరులోని గిరిజన బాలికల విద్యాలయం వెనకాల నిలిచిన మురుగు. దుర్వాసనకు తోడు దోమలకు ఆవాసంగా మారింది. జ్వరంతో బాలిక మృతి..ఉట్నూరు మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థిని కవిత జ్వరంతో బాధపడుతూ మంగళవారం కన్నుమూసింది. బాధిత కుటుంబీకులు, ఆదివాసీ సంఘాలు ఆందోళనకు దిగడంతో ఏఎన్ఎంను బాధ్యురాలిని చేస్తూ అధికారులు సస్పెండ్ చేసి చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుత పరిస్థితిలో వారానికోసారి విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాల్సిన వైద్యులు, సిబ్బంది పట్టించుకోకపోవడం, సకాలంలో స్పందించకపోవడమే ఆ విద్యార్థిని మరణానికి కారణమైంది.

అప్రమత్తత అవసరం..ఉట్నూరు ఏకలవ్య విద్యాలయంలో పలువురు విద్యార్థులు కొవిడ్ బారిన పడటం జిల్లా అంతటా కలకలం రేపుతోంది. తగిన జాగ్రత్తలు పాటించకపోవడం, మాస్కులు ధరించడం, భౌతికదూరం పాటించడాన్ని మర్చిపోయారు. ఈ తరుణంలో జిల్లా యంత్రాంగం వసతిగృహ విద్యార్థుల పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాల్సిన అవసరముంది.

నేరుగా ఆసుపత్రికి..ఇంద్రవెల్లి మండలం పిట్టబొంగరం ఆశ్రమోన్నత పాఠశాలలో రాఠోడ్ అనిల్ పదో తరగతి చదువుతున్నాడు. జ్వరం రావడంతో వాచ్‌మెన్ అతన్ని కిలోమీటరు దూరంలోని పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. ఇటీవల ఆశ్రమోన్నత పాఠశాలల్లో పనిచేసే ఏఎన్ఎంలను విధుల నుంచి తొలగించారు. దీంతో జలుబు చేసినా జ్వరం వచ్చినా ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిందే. అదే ఏఎన్ఎం ఉంటే ఆసుపత్రికి వచ్చే పరిస్థితి ఉండేదికాదని సదరు విద్యార్థి వాపోయారు.

ఇలాగైతే రోగాలు రావా..!పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి బూస మహేష్ జిల్లా కేంద్రంలోని అర్బన్, రూరల్, భీంపూర్ కస్తూర్బా విద్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు చోట్ల పాడైపోయిన చింతపండు కనిపించగా.. మరోచోట పురుగులు పట్టిన బియ్యం ఉన్నట్లుగా గుర్తించారు. వెంటనే ఆ బియ్యం మార్చాలని, చింతపండును వాడొద్దని ఆదేశించారు.

# బేల, జైనథ్‌లకు బైపాస్ రోడ్లు..



ఆదిలాబాద్ : జిల్లాలో నిర్మించనున్న మరో నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి సర్వే పనులు చకచక సాగుతున్నాయి. మహారాష్ట్ర మీదుగా ఆదిలాబాద్‌కు వస్తున్న జాతీయ రహదారి నం.353 జిల్లాలోని బేల, జైనథ్‌ల మీదుగా భోరజ్ వరకు నిర్మించేందుకు ఇదివరకే నిధులు మంజూరైన విషయం తెల్సిందే. తాజాగా ఎలాంటి అడ్డంకులు లేకుండా, వాహనాల రాకపోకలు సులువుగా సాగిపోయేలా బేల, జైనథ్ మండల కేంద్రాల్లో రెండుచోట్ల బైపాస్ దారులు నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. జిల్లా మీదుగా ఇదివరకే నాలుగు వరుసల రహదారి నం.44 అందుబాటులో ఉంది. ఆ దారికే కొత్తగా నిర్మించే నాలుగు వరుసల దారిని అనుసంధానించనున్నారు. జైనథ్ మండలం భోరజ్ వద్ద ఈ రెండు దారులు కలుస్తాయి. విస్తరించే కొత్తదారిని భోరజ్ నుంచి మొదలై తర్ణం, నిరాల, జైనథ్, దీపాయిగూడ మలుపు, కాప్రి మలుపు, బెల్గాం, బేల మండలం సిర్సన్న, బేల, కొబ్బాయి, శంకర్‌గూడ వరకు మొత్తం 33 కిలోమీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం జాతీయ రహదారిగా ఉన్న ఈ రెండు వరుసల దారినే నాలుగు వరుసల దారిగా మార్చేందుకు రూ.700 కోట్లు కేంద్రం నుంచి మంజూరు కాగా టెండర్ల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం ఓ ప్రయివేటు కన్సల్టెన్సీ సర్వే చేపడుతుండగా ఇందులో భాగంగానే బైపాస్ రోడ్లు పరిశీలనకు వచ్చాయి. కుడి వైపా? ఎడమ వైపా?

ప్రస్తుతం బేల, జైనథ్ మండల కేంద్రాల్లో అక్కడి పరిస్థితుల దృష్ట్యా బైపాస్ నిర్మాణాలే ఉత్తమమని అధికారులు భావిస్తున్నారు. మహారాష్ట్ర వైపు నుంచి భోరజ్‌కు వచ్చే దారిలో మండల కేంద్రానికి ఎడమవైపు బైపాస్ దారి నిర్మించాలా? లేక కుడివైపా అనేది ఇంకా తేలలేదు. బేలలో బైపాస్ నిర్మిస్తే చుట్టు నాలుగు కిలోమీటర్ల పొడవునా భూసేకరణ అవసరం. అదే జైనథ్‌లోనైతే మూడు కిలోమీటర్ల పొడవులో భూసేకరణ సరిపోతుంది. ఆయా మండల కేంద్రం మీదుగా ప్రస్తుతం వెళ్తున్న రోడ్డు పక్కల ఉన్న దుకాణాలు, ఇతర ఆస్తులు తొలగించి రోడ్డు నిర్మించాలా? అనే మూడో ప్రతిపాదన సైతం సిద్ధం చేశారు. బేల మండల కేంద్రంలో ఒక కిలోమీటర్ పొడవు, జైనథ్ మండల కేంద్రంలో 300 మీటర్ల పొడవులో ఈ దారి విస్తరించి ఉంది. అయితే ఆస్తుల నష్టం అధికంగా ఉంటుందనే బైపాస్ రోడ్డు నిర్మాణానికి మొగ్గుచూపుతున్నారు. ఈ దారిపై సిమెంటు లారీలు, ఇతర వాహనాల రద్దీ ఉండటంతో బైపాస్ రోడ్డు నిర్మించాలని గతంలోనే బేలలో ఆందోళనలు సైతం జరిగాయి. అందుకనే అక్కడ బైపాస్ తప్పనిసరి అని అంచనా వేస్తున్నారు. ఎక్కడి నుంచి రోడ్డు అనువుగా ఉంటుందనే దానిపై డ్రోన్‌తో సర్వే చేపట్టారు. ఏ వైపు ఉంచి బైపాస్ నిర్మించాలి? లేక ఉన్న దారినే విస్తరించాలనే దానిపై వారం రోజుల్లోగా దిల్లీ నుంచి అనుమతి వస్తుందని జాతీయ రహదారుల కార్యాలయ డీఈ సుభాష్ తెలిపారు.

# ఎవరూలేని చోట.. వేసెయ్ బాట

ఆసిఫాబాద్: ఒక రోడ్డు వేస్తున్నారంటే ఆ ప్రాంతంలో ఎన్ని జనావాసాలు ఉన్నాయి. ఏయే వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఎంత మంది ప్రజలకు ఉపయోగపడుతుందనే లెక్కలను ఇంజినీర్లు వేస్తారు. అందుకు అనుగుణంగా అంచనాలు వేసి ప్రతిపాదనలు రూపొందిస్తారు. పరిపాలన అనుమతులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తారు. జిల్లాలో ఇందుకు భిన్నంగా నేతలు చెప్పిన చోట, నివాసాలు లేని ప్రదేశంలో ఇష్టానుసారంగా రహదారులను నిర్మిస్తున్నారు. డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్) నిధులతో వేల సంఖ్యలో సీసీ రోడ్ల పనులే చేపడుతున్నారు. కేవలం బిల్లుల కోసమే పనులు అన్నట్లు ఇష్టారాజ్యంగా ప్రజాధనం వృథా చేస్తున్నారు. ఉపాధిహామీ, సీడీపీ నిధులు సైతం సీసీ రోడ్ల నిర్మాణాలకే అధికంగా ఖర్చు చేస్తున్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇబ్బడిముబ్బడిగా వేసిన ఈ రోడ్లలలో నాణ్యతకు పాతరేస్తున్నారు. కనీస నిబంధనలేవీ పాటించకపోవడంతో నెలల వ్యవధిలోనే ఈ రోడ్లు ధ్వంసమవుతున్నాయి. అడిగేవారు లేకపోవడంతో అందినకాడికి దండుకుంటూ.. నాసిరకం పనులు చేస్తున్నారు. రోడ్డు పనుల్లో 1:2:4 పాళ్లలో ఇసుక, కంకర, సిమెంటు మిశ్రమం వినియోగించాలి. 150 మిల్లీ మీటర్ల ఎత్తుతో సీసీలను వేయాలి. ముందుగా ఆరు ఇంచుల వరకు రహదారిని తవ్వి, నాణ్యమైన మొరం వేసి చదును చేయాలి. సీసీ రహదారి వేసిన అనంతరం 28 రోజుల వరకు నీళ్లు పట్టాలి. ఇందులో ఒక్కటీ కూడా జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. హడావుడిగా, మొక్కుబడిగా పనులను పూర్తి చేస్తున్నారు.

అధిక మొత్తం ఆ పనులకే..

నాలుగు సంవత్సరాల కాలంలో జిల్లాకు డీఎంఎఫ్‌టీ నిధులు రూ.130 కోట్లు రాగా, ఇందులో రూ.117 కోట్లు ఖర్చు చేశారు. మొత్తం 2574 పనులు చేపట్టగా ఇందులో దాదాపు 800 వరకు సీసీ రోడ్లే ఉన్నాయి. వీటిని సైతం నామినేషన్ పద్ధతిలో రూ.20 లక్షల రోడ్డును సైతం నాలుగు బిట్లుగా రూ.5 లక్షల చొప్పున విభజించి సీసీ పనులు చేపట్టారు. ఇలా అయితే ఎక్కువ మంది గుత్తేదారులకు అవకాశం ఉంటుందని, మామూళ్లు ఎక్కువ మొత్తంలో వస్తాయని కుయుక్తులు పన్నుతున్నారు. మరోవైపు ఉపాధిహామీ నిధులతో జిల్లా వ్యాప్తంగా 418 రహదారుల పనులు చేపట్టగా.. సీసీరోడ్లకే రూ.15 కోట్లు కేటాయించడం గమనార్హం.

ఎవరికి ఉపయోగమో..!

తిర్యాణి మండలంలోని పంగిడిమాదర సమీపంలో ఎలాంటి జనావాసాలు లేనిచోట రూ.4 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు ఇది. తలండిలో రూ.3 లక్షలతో గడలపల్లిలో రూ.4 లక్షలు ఖర్చు పెట్టి అసలు ఇళ్లే లేని ప్రదేశాల్లో రోడ్లు వేశారు. ఎవరికీ ఉపయోగపడని గిన్నెధరి శివారు ప్రాంతంలో రూ.10 లక్షలతో వేసిన సీసీరోడ్డు కొంతకాలానికే ధ్వంసమైంది.

వినియోగించడం లేదు..జిల్లా కేంద్రంలోని నూతన మిషన్ భగీరథ కార్యాలయం ఇటీవలే నిర్మించారు. ప్రధాన రహదారి నుంచి కార్యాలయానికి వెళ్లడానికి సీసీరోడ్డు నిర్మించి, ఓ భవనం చుట్టూ రహదారి వెళ్లడానికి మరో సీసీరోడ్డు ఏర్పాటు చేశారు. నిర్మించి సంవత్సరం గడుస్తున్నా ఈ రోడ్డును ఇంతవరకు వినియోగించలేదు. ఇందుకు రూ.2 లక్షలు ఖర్చు చేశారు.


# ఎవరూలేని చోట.. వేసెయ్ బాట

ఆసిఫాబాద్: ఒక రోడ్డు వేస్తున్నారంటే ఆ ప్రాంతంలో ఎన్ని జనావాసాలు ఉన్నాయి. ఏయే వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఎంత మంది ప్రజలకు ఉపయోగపడుతుందనే లెక్కలను ఇంజినీర్లు వేస్తారు. అందుకు అనుగుణంగా అంచనాలు వేసి ప్రతిపాదనలు రూపొందిస్తారు. పరిపాలన అనుమతులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తారు. జిల్లాలో ఇందుకు భిన్నంగా నేతలు చెప్పిన చోట, నివాసాలు లేని ప్రదేశంలో ఇష్టానుసారంగా రహదారులను నిర్మిస్తున్నారు. డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్) నిధులతో వేల సంఖ్యలో సీసీ రోడ్ల పనులే చేపడుతున్నారు. కేవలం బిల్లుల కోసమే పనులు అన్నట్లు ఇష్టారాజ్యంగా ప్రజాధనం వృథా చేస్తున్నారు. ఉపాధిహామీ, సీడీపీ నిధులు సైతం సీసీ రోడ్ల నిర్మాణాలకే అధికంగా ఖర్చు చేస్తున్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇబ్బడిముబ్బడిగా వేసిన ఈ రోడ్లలలో నాణ్యతకు పాతరేస్తున్నారు. కనీస నిబంధనలేవీ పాటించకపోవడంతో నెలల వ్యవధిలోనే ఈ రోడ్లు ధ్వంసమవుతున్నాయి. అడిగేవారు లేకపోవడంతో అందినకాడికి దండుకుంటూ.. నాసిరకం పనులు చేస్తున్నారు. రోడ్డు పనుల్లో 1:2:4 పాళ్లలో ఇసుక, కంకర, సిమెంటు మిశ్రమం వినియోగించాలి. 150 మిల్లీ మీటర్ల ఎత్తుతో సీసీలను వేయాలి. ముందుగా ఆరు ఇంచుల వరకు రహదారిని తవ్వి, నాణ్యమైన మొరం వేసి చదును చేయాలి. సీసీ రహదారి వేసిన అనంతరం 28 రోజుల వరకు నీళ్లు పట్టాలి. ఇందులో ఒక్కటీ కూడా జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. హడావుడిగా, మొక్కుబడిగా పనులను పూర్తి చేస్తున్నారు.

అధిక మొత్తం ఆ పనులకే..

నాలుగు సంవత్సరాల కాలంలో జిల్లాకు డీఎంఎఫ్‌టీ నిధులు రూ.130 కోట్లు రాగా, ఇందులో రూ.117 కోట్లు ఖర్చు చేశారు. మొత్తం 2574 పనులు చేపట్టగా ఇందులో దాదాపు 800 వరకు సీసీ రోడ్లే ఉన్నాయి. వీటిని సైతం నామినేషన్ పద్ధతిలో రూ.20 లక్షల రోడ్డును సైతం నాలుగు బిట్లుగా రూ.5 లక్షల చొప్పున విభజించి సీసీ పనులు చేపట్టారు. ఇలా అయితే ఎక్కువ మంది గుత్తేదారులకు అవకాశం ఉంటుందని, మామూళు ఎక్కువ మొత్తంలో వస్తాయని కుయుక్తులు పన్నుతున్నారు. మరోవైపు ఉపాధిహామీ నిధులతో జిల్లా వ్యాప్తంగా 418 రహదారుల పనులు చేపట్టగా.. సీసీరోడ్లకే రూ.15 కోట్లు కేటాయించడం గమనార్హం.

ఎవరికి ఉపయోగమో..! తిర్యాణి మండలంలోని పంగిడిమాదర సమీపంలో ఎలాంటి జనావాసాలు లేనిచోట రూ.4 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు ఇది. తలండిలో రూ.3 లక్షలతో గడలపల్లిలో రూ.4 లక్షలు ఖర్చు పెట్టి అసలు ఇళ్లే లేని ప్రదేశాల్లో రోడ్లు వేశారు. ఎవరికీ ఉపయోగపడని గిన్నెధరి శివారు ప్రాంతంలో రూ.10 లక్షలతో వేసిన సీసీరోడ్డు కొంతకాలానికే ధ్వంసమైంది. వినియోగించడం లేదు..జిల్లా కేంద్రంలోని నూతన మిషన్ భగీరథ కార్యాలయం ఇటీవలే నిర్మించారు. ప్రధాన రహదారి నుంచి కార్యాలయా నికి వెళ్లడానికి సీసీరోడ్డు నిర్మించి, ఓ భవనం చుట్టూ రహదారి వెళ్లడానికి మరో సీసీరోడ్డు ఏర్పాటు చేశారు. నిర్మించి సంవత్సరం గడుస్తున్నా ఈ రోడ్డును ఇంతవరకు వినియోగించలేదు. ఇందుకు రూ.2 లక్షలు ఖర్చు చేశారు.


## వసతి గృహాలకు సుస్తీ

ఆసిఫాబాద్: భవిష్యత్తు బాగుండాలని తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుతున్న విద్యార్థులకు ఇంటిని మరిపించే ఆహ్లాద భరితమైన వాతావరణం కల్పించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం అలసత్వం వల్ల అసౌకర్యాల మధ్యే చదువులు కొనసాగించాల్సి వస్తోంది. వసతితోపాటు బోధన అందించే ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. అపరిశుభ్ర పరిసరాలు, అసౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు విద్యార్థులు జ్వరాలతో ఆసుపత్రికి వెళితే కొవిడ్ నిర్ధారణ అవుతుండటంతో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. జ్వరాల వేళ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో పరిశీలన చేపట్టింది. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల ఆధ్వర్యంలో గురుకులాలు, వసతి గృహాలను నిర్వహిస్తున్నారు. గురుకులాల్లో విద్యార్థులకు కాస్త మెరుగైన సౌకర్యం ఉంటున్నా.. వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో మాత్రం సమస్యలు రాజ్యమేలుతున్నాయి. చాలీచాలని గదులు, సరిపడా లేని మరుగుదొడ్లు, శిథిల భవనాలు, అందని శుద్ధజలం, అపరిశుభ్ర వాతావరణం వెరసి విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదు.

నిలిచిన ఏఎన్ఎంల సేవలు..

జిల్లాలో 40 గిరిజన ఆశ్రమోన్నత, ఆరు శాటిలైట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 11,666 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతేడాది వరకు ప్రతి పాఠశాలకు వైద్య సేవల కోసం ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ఏఎన్ఎంలను కేటాయించారు. వారికి నెలకు రూ.నాలుగు వేలు వేతనం చెల్లించేవారు. వేతనం పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వేతనం పెంపుపై హామీ ఇవ్వకపోవడంతో వారు విధుల్లోకి రావడం లేదు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదమున్న నేపథ్యంలో ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల సేవలు నిలిచి పోవడం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తుంది. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే వారు సైతం ఆసుపత్రులకు పరుగులు తీయాల్సి వస్తోంది..

హాజరు అంతంతే..!

చిత్రంలో పడుకొని కనిపిస్తున్నది జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహం విద్యార్థి తరుణ్. ఏడో తరగతి జడ్పీ బాలుర పాఠశాలలో చదువుతూ ఇక్కడ వసతి పొందుతున్నాడు. తల, కడుపునొప్పితో బుధవారం సిక్ రూంలో పడుకున్నాడు. ప్రీ, పోస్టు మెట్రిక్ 70 మంది విద్యార్థులు ఇక్కడే వసతి పొందుతున్నారు. బుధవారం 15 మందే హాజరయ్యారు. వానలకు గదుల్లో నీరు చేరి ఇబ్బందులకు గురవుతున్నట్లు వాపోతున్నారు.

ఇంటిబాట పట్టిన విద్యార్థులు..

ఇది జిల్లా కేంద్రంలోని బీసీ వసతిగృహం. ఇక్కడ 112 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. భవనంలోని గదులన్నీ వర్షానికి ఊరుస్తున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు వచ్చి పరిశీలించి మరమ్మతులకు ఆదేశించారు. ఎడతెరిపిలేని వానలతో పనులు చేసే పరిస్థితి లేక ఆలస్యమవుతోంది. రెండురోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి మళ్లీ గదుల్లో నీరు చేరింది. ఇలాంటి గదుల్లో ఉండలేక విద్యార్థులంతా ఇంటిబాట పట్టారు. ముందే మురుగు..కాగజ్‌నగర్‌లోని ఆశ్రమోన్నత బాలుర పాఠశాల ముందు మురుగు కాలువతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణంతో దోమలు వృద్ధిచెంది వ్యాధులు ప్రబలుతు న్నాయని వాపోతున్నారు. 120 మందికి 110 హాజరయ్యారు. నీటిశుద్ధి యంత్రం పని చేయడంలేదు. మెనూ సక్రమంగా పాటించడంలేదు. వార్డెన్ అందుబాటులో ఉండటం లేదని విద్యార్థులు చెబుతున్నారు.

# పనితీరు మార్చుకోకపోతే టికెట్ ఇచ్చేది లేదు: ఎమ్మెల్యేలకు సీఎం జగన్ హెచ్చరిక



అమరావతి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పనితీరులో 15 మంది ఎమ్మెల్యేలు బాగా వెనకబడ్డారని సీఎం జగన్ తెలిపారు. పనితీరు మెరుగుపరచుకోవాలని.. లేదంటే వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇవ్వబోమని తేల్చి చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వంపై సీఎం జగన్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేల పనితీరుపై చేసిన సర్వే నివేదిక వివరాలను ఆయన వెల్లడించారు. ఈనెల 23న జగనన్న సురక్ష కార్యక్రమంపై వాలంటీర్లకు శిక్షణ ఇవ్వాలని సీఎం జగన్ ఆదేశించారు. ఈనెల 24 నుంచి నెల రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. 11 రకాల ధ్రువపత్రాలు కావాల్సిన వారి వివరాలు తీసుకుని వెంటనే జారీ చేయాలని సూచించారు. రేషన్ కార్డుల్లో పేర్లు జతచేయడం, కార్డు విభజన తదితర కార్యక్రమాలు చేయాలని ఆదేశించారు. దరఖాస్తు చేసిన వారి కుల, ఆదాయ ధ్రువీకరణ, జనన, మరణ, వివాహ, తదితర ధ్రువపత్రాలు ఇంటికి వెళ్లి జారీ చేయాలని సూచించారు. మరో 9నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని నేతలతో సీఎం జగన్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో 175కు 175 సీట్లు గెలవాలని చెప్పారు. ఎన్నికల్లో తప్పని సరిగా గెలిచేందుకు అంతా కష్టపడి పనిచేయాలన్నారు.




ఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా తొమ్మిదవ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఐరాస వేదికగా జరగనున్న యోగా కార్యక్రమానికి నేతృత్వం వహించనున్నారు. మరో వైపు కేంద్రమంత్రులు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో యోగా కార్యక్రమాల్ని ముందుండి నడిపిస్తున్నారు. మంచుకొండల్లో ఆర్మీ నిర్వహించిన యోగా దినోత్సవ చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు! యోగా అనేది మన నాగరికత సాధించిన గొప్ప విజయాల్లో ఒకటి. ఈ ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప బహుమతుల్లో ఒకటి. యోగా శరీరం, మనస్సు మధ్య సమతుల్యం ఏర్పరుస్తుంది. యోగా.. మన జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతుంది. అందుకే యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలని కోరుతున్నాను. **– రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**

అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు. ఈ యోగా దినోత్సవంతో.. ప్రపంచవ్యాప్తంగా యోగా ఒక ఉద్యమంగా మారింది. యోగా ద్వారా మన అడ్డుగోడలను, అవరోధాలను తొలగించుకోవాలి. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్'అనే స్ఫూర్తిని ప్రపంచానికి అందించాలి. **– ప్రధాని మోదీ**

# జగన్ ఉద్యోగులను మోసం చేశారు..




విజయవాడ: సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ఉద్యోగులను మోసం చేశారని, జీపీయస్ పేరుతో ఉద్యోగులు పది శాతం చెల్లించాలని చెప్పడం ఏంటని ఫ్యాప్టో ఛైర్మన్ ఎన్ వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. బుధవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే హామీలను నమ్మే పరిస్థితిలో లేమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని ఐక్య కార్యాచరణకు సిద్ధమవుతామని స్పష్టం చేశారు. 11వ పీఆర్సీ విషయంలో మోసం చేశారని, 12వ పీఆర్సీ విషయంలో విధివిధానాలు చెప్పకుండా మళ్లీ మాయ చేస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. జులై 2023 నుంచి ఫిట్ మెంట్‌తో కూడిన పీఆర్సీ ఇవ్వాలని, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని, సీపీయస్, జీపీయస్ రద్దు చేసి పాత పెన్షన్ మాత్రమే అమలు చేయాలని ఎన్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో కలిసి వచ్చే వారితో ఉద్యమం చేస్తామన్నారు. విద్యారంగంలో నూతన విధానాలతో పని ఒత్తిడి పెంచుతున్నారని, మూడు ఆదివారాలు వరుసగా జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. తమ డిమాండ్ల పరిష్కారంపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని.. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు. ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దును అమలు చేయకుండా జీపీయస్‌ను రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిందని, ఈ విధానం మేలు చేస్తుందని మభ్య పెట్టేలా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. జీవో 117 పేరుతో పాఠశాలలను విలీనం చేసి పిల్లలు లేకుండా చేశారని, ఈ చర్యల వల్ల పిల్లల నమోదు సంఖ్య చాలా వరకు తగ్గిపోయిందన్నారు. 99 లోపు విద్యార్థులు ఉంటే టీచర్‌ను ఇవ్వబోమని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారని.. దీని వల్ల టీచర్లను మరో చోటుకు బదిలీ చేస్తున్నారన్నారు.

ఎంఈవో ప్రమోషన్ల పేరుతో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని, ఐదేళ్ల కాల పరిమితి పేరుతో కేవలం పది వేల మందిని మాత్రమే రెగ్యులర్ చేశారన్నారు. తమకు ఇవ్వాల్సిన బకాయిలు ఒకే విడతలో ఇవ్వాలని, విడతల వారీగా అంటే తాము అసలు ఉంటామో లేదోనని అన్నారు. సీఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం అమలు కోసం అందరూ ఐక్యంగా పోరాటంలోకి రావాలని చెన్నుపాటి మంజుల పిలుపిచ్చారు.

# 'జగనన్న సురక్ష' ప్రజలకు మేలు చేసే అద్భుత కార్యక్రమం

## సీఎం సమీక్ష అనంతరం మీడియాతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తాడేపల్లి: ప్రజలకు మేలు జరిగే మంచి కార్యక్రమం 'జగనన్న సురక్ష' అని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం గురించి సీఎం వైయస్ జగన్ క్షుణ్ణంగా వివరించారని చెప్పారు. నెలరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి ఏ విధంగా వెళ్లాలి, అధికారులు, గృహ సారథులు, వలంటీర్లు, కార్యకర్తలు సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యలను వెనువెంటనే పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారన్నారు. జగనన్న సురక్ష అద్భుతమైన కార్యక్రమం అని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జగనన్న సురక్ష, గడప గడపకు మన ప్రభుత్వంపై సమీక్ష అనంతరం క్యాంపు కార్యాలయ ఆవరణలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. 'గడప గడపకు మన ప్రభుత్వంపై సీఎం సమీక్ష జరిపారు. వచ్చే 9 నెలలు చాలా కష్టపడాలని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విస్తృతంగా చేపట్టాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలు కచ్చితంగా గెలుపొందాలని సీఎం చెప్పారు. ఆ దిశగా పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు అందరూ కలిసి గడప గడపకు మన ప్రభుత్వం విస్తృతంగా చేపట్టాలి.. ఇది మంచి కార్యక్రమం అని సీఎం సూచించారు" అని మంత్రి కారుమూరి చెప్పారు. 2014 నుంచి 2019 వరకు గత ప్రభుత్వ హయాంలో ఎన్ని సెక్టార్లు కుప్పకూలిపోయాయో.. ఏరకంగా జీడీపీ, ఫైనాన్స్, అగ్రికల్చర్, డెవలప్‌మెంట్స్ ఎంత కుంటుపడ్డాయో అన్నింటినీ సీఎం వైయస్ జగన్ పూర్తిగా వివరించారు. వైయస్ఆర్ సీపీ ప్రభుత్వం వచ్చాక నాలుగు సంవత్సరాల్లో రాష్ట్రంలో ప్రగతి ఏరకంగా జరిగింది, జీడీపీ రేట్, ఫైనాన్స్ గ్రోత్ గురించి వివరించారు. ఎల్లో మీడియా రకరకాల పచ్చి అభూత కల్పనలు సృష్టిస్తోంది. ఆ దుష్ప్రచారాలను ఆధారాలతో సహా తిప్పికొట్టాలి. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని, రాష్ట్రం సాధించిన గ్రోత్‌ను ప్రజలకు వివరించాలని సమీక్షలో సీఎం వైయస్ జగన్ సూచించారు" అని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు.

# కాపు జాతిని తాకట్టు పెట్టొద్దు... ముద్రగడకు కాపు సంక్షేమ సేన హెచ్చరిక

విజయవాడ: కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంపై కాపు సంక్షేమ సేన నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీకి అమ్ముడుపోయిన ముద్రగడ.. కాపు జాతిని తాకట్టు పెట్టవద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు. కాపు సంక్షేమ సేన నేత కృష్ణాంజనేయులు మాట్లాడుతూ.. ముద్రగడ పద్మనాభం లేఖ కాపులంతా తలదించుకునేలా ఉందన్నారు. ఆయన స్థాయిని ఆయనే ఈ లేఖతో దిగజార్చుకున్నారని తెలిపారు. జనసేనాధిపతిగా ఉన్న పవన్ కళ్యాణ్‌ను సినీ హీరోగా ప్రస్తావించడం వెనుక కుట్ర అర్థం అవుతుందని అన్నారు. కాడి పారేసి ఇంట్లో కూర్చున్న ముద్రగడ ఇప్పుడు లేఖ రాయడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. కాపు ఉద్యమంలో నష్టపోయిన వారిని పరామర్శించారా అంటూ నిలదీశారు. వంగవీటి మోహనరంగా పేరు జిల్లాకు పెట్టాలని ఎందుకు డిమాండ్ చేయలేదని అడిగారు. పవన్ కళ్యాణ్‌ను, అతని కుటుంబ సభ్యులను బూతులు తిడితే నువ్వెక్కడున్నావని అన్నారు. కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కాపు మహిళలను కొడితే ఎందుకు ఖండించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపు రిజర్వేషన్ ఇవ్వను అన్న జగన్‌కు ఎలా మద్దతు ఇస్తున్నావంటూ కృష్ణాంజనేయులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మరోనేత రుద్రనాయుడు మాట్లాడుతూ.. ముద్రగడ లేఖ వెనుక ఆయన రాజకీయ స్వార్థం ఉందని ఆరోపించారు. 2019 వరకు అనేక ఉద్యమాలు చేసి తరువాత ఎందుకు సైలెంట్ అయ్యారని ప్రశ్నించారు. తుని ఘటనలో అమాయక కాపు యువత జీవితాలను నాశనం చేశారని మండిపడ్డారు. కాపుల ముసుగులో జగన్‌కు, ద్వారంపూడికి అనుకూలంగా పని చేస్తున్నారని ఆరోపించారు. "నీకు దమ్ముంటే వైసీపీలో చేరి పనిచేసుకో.. కాపు నేత ముసుగులో డ్రామాలు ఆడితే యువత తరిమి కొడతారు" అంటూ హెచ్చరించారు. హరిరామ జోగయ్య కాళ్లు కడిగి నెత్తిన జల్లుకో... బుద్ధి అయినా వస్తుంది అంటూ వ్యాఖ్యలు చేశారు. సుజాత నాయుడు మాట్లాడుతూ.. కాపు ఉద్యమ నేతగా చెప్పుకునే అర్హత ముద్రగడ కోల్పోయారన్నారు. తన స్వార్థానికి కాపు ఉద్యమాన్ని ఇప్పటికే తాకట్టు పెట్టారన్నారు. ఇప్పుడు ముద్రగడ అమ్ముడుపోయి లేఖ రాశారన్నారు. రంగా పేరు చెప్పుకుని బతికే ముద్రగడ... జిల్లాకు ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేయలేదే అని నిలదీశారు. ద్వారంపూడి అనే రౌడీ కోసం పవన్ కళ్యాణ్‌ను కించ పరుస్తావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "కులం అడ్డం పెట్టుకుని బతకడం కాదు.. వైసీపీ కండువా కప్పుకుని రా... జన సైనికులు నీ సంగతి తేలుస్తారు" అంటూ హెచ్చరించారు.

# ధర్మానను ఎంపీగా పోటీ చేయమన్న జగన్...?



శ్రీకాకుళం జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి ధర్మాన ప్రసాదరావుని ఈసారి ఎంపీ బరిలో నిలబెట్టాలని ముఖ్యమంత్రి వైసీపీ అధినేత జగన్ సీరియస్ గా ఆలోచిస్తున్నారు అని జిల్లాలో ప్రచారం సాగుతోంది. వైసీపీలోనూ దీని మీద చర్చ సాగుతోంది. ఈ రోజుకు చూస్తే శ్రీకాకుళం ఎంపీ సీటుకు బలమైన అభ్యర్థి ఎవరూ లేరు. ఎవరిని పెట్టినా గెలుపు అన్నది సందేహమే అన్నది వైసీపీకి అందుతున్న ఫీడ్ బ్యాక్. అంత గట్టిగా సిట్టింగ్ ఎంపీ కింజరాపు రామ్మోహనాయుడు ఉన్నారు. ఆయన ఇప్పటికి రెండు సార్లు గెలిచి తిరుగులేని శక్తిగా అవతరించారు. హ్యాట్రిక్ కొట్టేలాగానే ఉన్నారు. వైసీపీ నుంచి సరైన అభ్యర్థిని పెట్టకపోతే రామ్మోహన్ నాయుడుది క్యాట్ వాక్ లాంటి విజయమే అంటున్నారు. దాంతో తర్జన భర్జన పడుతున్న వైసీపీ అధినాయకత్వం ఎవరో ఎందుకు ధర్మాన ప్రసాదరావునే బరిలోకి దింపాలని ఒక కీలక డెసిషన్ తీసుకుంది అని అంటున్నారు. నిజానికి ఇదేమీ కొత్త ప్రతిపాదన కాదు 2014 2019లలో ధర్మాన ప్రసాదరావుని ఎంపీగానే పోటీ చేయమని జగన్ కోరారు. ఆనాడు ఆయన సున్నితంగా తిరస్కరించి ఎమ్మెల్యేగానే బరిలోకి దిగారు. మరో దఫా ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి ధర్మాన పెద్దగా సుముఖంగా లేరని టాక్ నడుస్తోంది. తన కుమారుడు రామ మనోహర్ నాయుడుని శ్రీకాకుళం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయించాలని చూస్తున్నారు. అయితే ఇక్కడే వైసీపీ హై కమాండ్ ఒక ఆఫర్ ఇస్తోందా అన్న చర్చ సాగుతోంది. జూనియర్ ధర్మానకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తూ సీనియర్ ధర్మానను ఎంపీగా బరిలోకి దింపుతారా అన్నదే ఆ ఆఫర్. అంటే తండ్రీ కొడుకులకు టికెట్ ఇస్తూ సీనియర్ మంత్రిని కనుక ఎంపీగా బరిలో ఉంచితే ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న మొత్తం పది ఎమ్మెల్యే సీట్లను సులువుగా గెలుచుకోవచ్చు అన్నదే వైసీపీ ప్లాన్ గా ఉంది అని అంటున్నారు. మరో వైపు చూస్తే ఈ విషయం మీద ధర్మాన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియదు అని అంటున్నారు. ధర్మాన తన రాజకీయ జీవితం ఇక చాలు అని అనుకుంటున్నారు అని అంటున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఆయన ఎక్కువ సార్లు మంత్రిగా పనిచేసిన చరిత్ర ఉంది. దాంతో తాను ఇక పాలిటిక్స్ ని చాలించి వారసుడిని ఎమ్మెల్యేగా చూడాలని అనుకుంటున్నారు. ఇంకో వైపు చూస్తే కింజరాపు ఫ్యామిలీకి ధర్మాన ఫ్యామిలీకి తెర వెనక బంధం ఉ ందని అంతా అంటూంటారు. వారికి వీరూ వీరికి వారూ సాయం చేసుకుంటారని కూడా అంటూంటారు. ఆ కారణంగా రెండు సార్లు శ్రీకాకుళం ఎంపీ సీటు వైసీపీకి కాకుండా పోయిందని కూడా వైసీపీ నేతల మాటగా ఉంది. అందుకే ఈసారి ఎవరో ఎందుకు ధర్మాననే బరిలోకి దింపితేనే విజయం సాధిస్తామని జగన్ ఫిక్స్ అయినట్లుగా వార్తలు వస్తున్నాయి. మరి జగన్ మాట ఫైనల్ అయితే మాత్రం ధర్మాన పోటీ చేయాల్సిందే అని అంటున్నారు. అదే కనుక జరిగితే మాత్రం ఫస్ట్ టైం కింజరాపు ఫ్యామిలీ వర్సెస్ ధర్మాన ముఖా ముఖీ ఫటింగ్ శ్రీకాకుళం జిల్లాలో జరుగుతుంది అని అంటున్నారు. చూడాలి మరి ఆ రాజకీయ సమరం ఏ రేంజిలో ఉంటుందో.

# కాపుల్లో భారీ చీలిక...ఏపీ పాలిటిక్స్ లో బిగ్ ట్విస్ట్




అమరావతి : ఏపీ రాజకీయాల ను మలుపు తిప్పేందుకు ఈసారి కాపులు కీలక పాత్ర పోషిస్తారు అని అంతా అనుకుంటున్నదే. అయితే కాపుల లో భారీ చీలిక వచ్చె సూచనలు కనిపిస్తున్నాయి. తాను కాపు నాయకుడిని అని బాహాటంగా చెప్పుకోకుండానే పవన్ ఆ సామాజికవర్గం ఓట్ల మీద గట్టి ఆశలే పెట్టుకున్నారని అంటున్నారు. అందుకే ఆయన వారాహి యాత్ర ను కూడా కాపులు ఎక్కువగా ఉ ండే గోదావరి జిల్లాల గుండా నడిపించారని అంటున్నారు. పవన్ సినీ అభిమానం ఓట్ల కింద కన్వర్ట్ ఎంతవరకూ అవుతుందో తెలియదు కానీ కాపుల ఓట్లు మాత్రం జనసేన కు ఊపిరి పోస్తాయన్న ఆశలో ఆ పార్టీ ఉంది. అయితే కాపుల ఓట్లు గుత్తమొత్తంగా పవన్ కి పడతాయా అంటే దాని మీద ఎపుడూ చర్చ ఉంటూనే ఉంది. వైసీపీ కాపులు టీడీపీ కాపులు అందులో తమ వాటా తీసుకుంటారని కూడా వాదన ఉంది. ఇపుడు కాపు కులానికే చెందిన ముద్రగడ పద్మనాభం మనసు లో మాట ను బయటపెట్టారు. కాపుల కు తన కంటే ఎక్కువగా చేయాలని ఉద్యమాన్ని నడిపించాలని పవన్ కి సవాల్ చేస్తూనే తాను చేసిన ఉద్యమం ఎవరూ చేయలేనిది అని చెప్పుకున్నారు. తాను నిస్వార్థంగా ఉద్యమం చేశాను అని అంటున్నారు. అదే టైం లో ముద్రగడ పవన్ రాజకీయ పోకడల ను కడిగి పారేశారు. అసలు పార్టీ అధినేత తీరు ఇదేనా అంటూ గట్టిగానే మాట్లాడారు. ఇది ఒక విధంగా కాపు సోదరుల ను ఆలోచింపచేసేదిగా ఉందని అంటున్నారు. అదే విధంగా కాపులను సీఎం అవుతాను అని పవన్ చెబుతూ మభ్యపెడుతున్నారన్న పరమ సత్యాన్ని కూడా ముద్రగడ చెప్పేశారు. తెర వెనక పొత్తు బంధం అలా ఉండగానే సీఎం క్యాండిడేట్ పేరిట ఎక్కువ సీట్లను గెలుచుకోవడానికి పవన్ చేస్తున్న రాజకీయం గుట్టు విప్పారు. అంతే కాదు కాపు మంత్రులు మాజీ మంత్రులు ఎంతమంది విమర్శలు చేసినా అది ఒక ఎత్తు. కానీ కాపు జాతి కోసం దశాబ్దాల పాటు ఉద్యమిస్తూ జనంలో న్యూట్రల్ వర్గాలతో పాటు రాజకీయాల కు అతీతంగా కులాలకు అతీతంగా మంచి పేరు సంపాదించుకున్న ముద్రగడ పవన్ని విమర్శించడం అంటే అది కచ్చితంగా జనసేనకు బిగ్ ఎఫెక్ట్ అని అంటున్నారు. ఇప్పటిదాకా వైసీపీ కాపు నేతలు విమర్శలు చేస్తే మాట కు మాట అన్నట్లుగానే అంతా తీసుకున్నారు. కానీ ఇపుడు ముద్రగడ వంటి కాపుల లో మంచి ఆరాధన ఉన్న నాయకుడు పవన్ చేస్తున్నది తప్పు అనడం అంటే కచ్చితంగా అది కాపుల లో ప్రభావం చూపిస్తుంది అని అంటున్నారు. కాపుల ఓట్లలో ఆ విధంగా భారీ చీలిక తీసుకురావడానికి ముద్రగడ బీజం వేశారని అంటునారు. ఇక గోదావరి జిల్లాల పాలిటిక్స్ చూసినా కాపుల తీరు చూసినా అరవై ఏళ్ళు దాటిన వారు అంతా వైసీపీ వైపు ఉంటే నలభై నుంచి అరవై ఏళ్ల బ్యాచ్ టీడీపీ కి అండగా ఉంది. ఇరవై నుంచి నలభై ఏళ్ల బ్యాచ్ జనసేన వైపు మొగ్గు చూపిస్తున్నారు. ఇపుడు ముద్రగడ పవన్ కి ఘాటు లేఖ రాయడం ద్వారా కాపుల కు పవన్ ఏమి చేశారు ఏమి చేయబోతున్నరు అన్న కొత్త సందేహాలను బయటపెట్టారు. అంతేకాదు కాపుల కోసం కచ్చితంగా చేయాలన్నా వారి ముఖ్యమంత్రి ఆశలు తీర్చాలన్నా కూడా 175 సీట్లకే పోటీ చేయాలని గట్టి సవాల్ నే విసిరారు. అపుడే కాపులు నమ్ముతారు అన్నట్లుగా ముద్రగడ వాదన ఉంది. ఒక విధంగా ఇది జనసేన రాజకీయ డొల్లతనాన్ని కానీ పవన్ కళ్యాణ్ తడబాట్ల పొరపాట్ల వ్యూహాల కు కానీ గట్టిగా దెబ్బ కొట్టేదే అంటున్నారు. పవన్ వైపు ఉన్న వారు ఉండవచ్చు కానీ కాపుల్లో న్యూట్రల్ పర్సన్స్ అన్ని విషయాలూ ఆలోచించేవారు అయితే మాత్రం కచ్చితంగా ముద్రగడ లేఖ ను ఒకటికి పదిసార్లు చదువుతారని వారిలో నూ ఇలాంటి అభిప్రాయాలు ఉంటే కనుక వారు జనసేన పట్ల తన ఉద్దేశ్యాల ను మార్చుకునే ప్రమాదం ఉందని అంటున్నారు. ఏది ఏమైనా కాపులు సాలిడ్ గా పవన్ వైపు కాదు అన్నట్లుగా ముద్రగడ ఇపుడు బయటకు వచ్చి లేఖను సంధించారు. ఇది ఆరంభం మాత్రమే అంటున్నారు. గోదావరి జిల్లాలలో పుట్టి ఉద్యమాల్తో పెరిగిన ముద్రగడ పవన్ కి యాంటీ అన్నది స్ప్రెడ్ అయితే మాత్రం ఆ ప్రభావం జనసేన మీద గట్టిగాఎన ఉంటుంది మరి.

# ఈసీ లేఖతో జగన్ శాశ్వత అధ్యక్షుడు కాదన్న రఘురామ



ఢిల్లీ: తమ పార్టీ పేరు వైఎస్ఆర్ కాంగ్రెస్ కాదని కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన సమాచారాన్ని బట్టి తెలిసింది అని నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడారు. "గతంలో మా పార్టీ ప్లీనరీలో జగన్మోహన్ రెడ్డిని శాశ్వత కాల అధ్యక్షుడు అని ప్రకటించారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి గతంలో లేఖ రాశాను.

ఈరోజు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి నాకు లేఖ వచ్చింది. యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ పేరును వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీగా.. కానీ వైఎస్సార్ సీపీగా మార్చే ప్రతిపాదన, ఆలోచన లేదని లేఖ కేంద్ర ఎన్నికల సంఘానికి ఇచ్చారు. జగన్.. వైసీపీ శాశ్వత అధ్యక్షుడు కాదు.. అలాంటి తీర్మానం ఎప్పుడూ చేయలేదు అని ఎన్నికల సంఘానికి వివరణ ఇచ్చారు. మా వాళ్ళు ఇప్పుడు తెలుసుకున్నారు. ప్లీనరీలో విజయసాయిరెడ్డి తీర్మానం చదువుతుంటే జగన్ మూసి మూసి నవ్వులు నవ్వుకున్నారు." అని ఎద్దేవా చేశారు.

# చంద్రబాబు తన వైఖరి మార్చుకోవాలి



ప్రకాశం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సీబీఐని రాష్ట్రంలోకి రావద్దన్నారని.. కేంద్ర ప్రభుత్వ సంస్థలను రాష్ట్రంలోకి అనుమతించలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శాంతి భద్రతలు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉంటాయని తెలిపారు. చంద్రబాబు తాను సీఎంగా ఉన్న సమయంలో అనుమతించకుంటే జగన్ పాదయాత్రలు చేసేవారా అని అంటున్నారని... ఐదేళ్లు జగన్‌ను రోడ్లపై నడిపించారని అన్నారు. బెంగాల్‌లో ఐదు వందల మంది బీజేపీ కార్యకర్తలు హత్యకు గురైనా తాము ప్రజాస్వామ్యయుతంగా పోరాటం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రతి విషయంలో కేంద్రాన్ని విమర్శించటం సరికాదన్నారు. చంద్రబాబు తన వైఖరి మార్చుకోవాలని హితవుపలికారు. చంద్రబాబు ప్రత్యేక హోదా వద్దన్నారని తెలిపారు. ఇప్పుడు సభలు పెడుతున్న చంద్రబాబును అప్పుడు ప్రత్యేక హోదా ఎందుకు వద్దన్నారో ప్రశ్నిస్తున్నారా అని అడిగారు. చంద్రబాబు బీజేపీ పెద్దలను వెళ్లి కలసివచ్చారని.. వారు పొత్తులపై నిర్ణయం తీసుకుంటారని సోమువీర్రాజు పేర్కొన్నారు.

# విద్యుత్ భారాలు తగ్గించకపోతే మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదు

విజయవాడ: కృష్ణలంకలో విద్యుత్ భారాలకు నిరసనగా సీపీఎం పోరుబాటకు దిగింది. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాల ద్వారా సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న మోసాలను సీపీఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మోడీ ఆదేశాలతో జగన్ ప్రజలపై విద్యుత్, పన్నుల భారాలు మోపుతున్నారని విమర్శించారు. సర్దుబాటు ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు, సుంకం ఛార్జీల పేరుతో ముక్కు పిండి వసూళ్లు చేస్తున్నారని మండిపడ్డారు. రెండు వేలు వచ్చే వారికి నాలుగు వేలు బిల్లు వస్తుందని.. రెండు వందలు వచ్చే వారికి ఎనిమిది వందలు వస్తుందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలను మళ్లీ అంధకారంలోకి నెడుతున్నారని అన్నారు. వేసవిలో ఏసీలు వేస్తే బిల్లు రాదా అని ప్రచారం చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు అన్నం తింటున్నారా.. గడ్డి తింటున్నారా అని ఆయన వ్యాఖ్యలు చేశారు. కనీసం ప్రజలకు వాస్తవాలు కూడా చెప్పలేని దుస్థితిలో ఉన్నారన్నారు. అదానీ కోసమే స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారన్నారు. బయటి రాష్ట్రాల కన్నా ఐదు రెట్లు ఎక్కువ పెట్టి కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రజలు ఈ నిర్ణయాలను తీవ్రంగా వ్యతరేకించాలని అన్నారు. విద్యుత్ భారాలు తగ్గించకపోతే మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. గత పాలకుల తరహాలో జగన్ కూడా అడ్రస్ లేకుండాపోతారన్నారు. పేద ప్రజలను దోచుకోవడమే ప్రజాపాలన అని విమర్శించారు. సోషల్ మీడియా, అనుకూల మీడియాలో అసత్యాలు ప్రచారం చేస్తారా అని అడిగారు. విద్యుత్ భారాలపై వైసీపీ నాయకులు, ఎమ్మెల్యేలు దమ్ముంటే చర్చకు రావాలని.. తమ దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని... చూపిస్తాం రండి అంటూ సవాల్ విసిరారు. జగన్మోహన్ రెడ్డి తీరు మార్చుకోవాలని.. లేదంటే ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని సీపీఎం నేత దోనేపూడి కాశీనాథ్ హెచ్చరించారు.

## పెద్ద సినిమాతో పెద్ద పేరు వస్తుందనుకుంటే..!

అఖిల్ అక్కినేని హీరో సురేందర్ రెడ్డి దర్శకత్వంలో వచ్చిన మూవీ ఏజెంట్. ఈ చిత్రం గతవారం విడుదలై మొదటి షో నుండే విపరీతమైన నెగెటివ్ టాక్ అందుకుంది. ఏ విభాగంలోనూ కనీసం పాజిటివ్ టాక్ తెచ్చుకోలేక బాక్సాఫీస్ ముందు పూర్తిగా నిరాశపరిచింది. ఏజెంట్ మూవీ చెప్పుకోవడానికి ఏ ఒక్కటీ లేదని రివ్యూయర్లు చెబుతున్నారు. ఇందులో అఖిల్ లుక్ తప్పించి దాని కోసం అతడు పడిన కష్టం తప్ప సినిమాలో ఏదీ వర్కవుట్ కాలేదు. సినిమాలో బీస్ట్ లుక్ మాత్రం బాగుందనే చెప్పాలి. అలాగే సినిమాలో లవ్ ట్రాక్ మరీ విసిగించింది. బీస్ట్ తరహాలో కనిపించే హీరో పక్కన



అందాల సుందరి చూడటానికి బ్యూటీ అండ్ ది బీస్ట్ లా కనిపిస్తుందని అనుకున్నారు. హీరోయిన్ సాక్షి వైద్య తన అందాల ఆరబోతతో రొమాంటిక్ రిలీఫ్ ఇస్తుందని భావించారు. కానీ హీరోయిన్ పాత్ర మరీ నామమాత్రంగా సాగుతుంది. మినిమం స్క్రీన్ ప్రెజెంటేషన్ లేకపోవడంతో తను ప్రేక్షకులకు కనెక్ట్ కాలేకపోయింది. అలా మధ్య మధ్యలో వచ్చే లవ్ ట్రాక్ బోర్ కొట్టేలా మారిపోయింది.

మూవీ మేకర్స్ సాక్షి వైద్య అందాలను ఏమాత్రం వాడుకోక పోవడం తనకు మినిమం స్క్రీన్ టైం ఇవ్వకపోవడంతో సాక్షి వైద్య స్పార్క్ కనిపించకుండా పోయింది. సినిమా విడుదలకు ముందు నిర్మాత అనిల్ సుంకర సహా ఏజెంట్ టీమ్ అంతా సాక్షి వైద్యకు విపరీతమైన హైప్ ఇచ్చారు. రాబోయే రోజుల్లో స్టార్ హీరోయిన్ గా ఎదగబోతుందని ఆకాశానికి ఎత్తారు. కానీ గ్రౌండ్ రియాల్టీ మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తను గ్లామర్ పరంగా కూడా సినీ ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. తన అభినయం కూడా సో సో గా ఉంది అనే టాక్ వినిపించింది. ఇక ఏజెంట్ సినిమా ఈ మధ్యకాలంలో వచ్చిన బిగ్గెస్ట్ డిజాస్టర్ గా నిలుస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నారు. అనిల్ సుంకర సురేందర్ రెడ్డి కలిసి రూ.65 కోట్ల బడ్జెట్ తో నిర్మించిన ఈ చిత్రం ఏమాత్రం ఆకట్టుకునే రీతిలో కలెక్షన్లు రాబట్టడం లేదు. విడుదలైన తొలి రోజు రూ.5.95 కోట్లు రెండో రోజు రూ.1.6 కోట్లు మూడో రోజు అతి తక్కువగా రూ.1 కోటి ఇండియా నెట్ కలెక్షన్స్ మాత్రమే సాధించింది.

## ఫ్లాప్స్ వచ్చినా ఆగని రష్మిక

నేషనల్ క్రష్ రష్మిక బాలీవుడ్ లో రాణించేందుకు బాగానే కష్టపడుతోంది. ఆమె పుష్ప సినిమాతో జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. దీంతో బాలీవుడ్ లో ఎలాంటి కష్టం లేకుండా వెంట వెంటనే అవకాశాలు చేజిక్కించుకుంది. వరసగా గడ్ బై మిషన్ మజ్నా వంటి సినిమాల్లో నటించింది. ఆ సినిమాలపై ఎక్కువ ఆశలు పెట్టుకుంది కానీ పెద్దగా ఫలితం దక్కలేదు. ఈ రెండు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. అయితే.. రెండు వరసగా ఫ్లాప్ అయినా కూడా ఆమెకు బాలీవుడ్ లో మరో సినిమా దక్కింది. మరాఠీ యోధుడు మరాఠీ రాజ్య వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ నేపథ్యంలో ఓ సినిమా తెరకెక్కిస్తున్నారు. అయితే ఇప్పుడు అలాంటి యుద్ధ వీరుడి కోడలిగా నటించబోతుందట రష్మిక. శివాజీ పెద్ద కుమారుడు శంభాజీ భోంస్లే జీవితం ఆధారంగా.. బాలీవుడ్లో ఓ భారీ పీరియాడికల్



ప్రాజెక్ట్ ప్లాన్ చేస్తున్నారట. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో బాలీవుడ్ యంగ్ హీరో విక్కీ కౌశాల్ హీరోగా నటించనున్నాడట. శంభాజీ భోంస్లేగా విక్కీ కౌశల్ ఆయన భార్య మహారాణి ఏసుబాయి భోంస్లేగా రష్మికా మందన్నా నటించనున్నారని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఈ సినిమాకు 'ఛావా' అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్టు టాక్. ఇక ఈ ప్రాజెక్ట్ను భారీ బడ్జెట్తో తెరకెక్కించబోతున్నారట. ఇప్పటికే రష్మిక ఈ ప్రాజెక్ట్కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే కాదు.. మహారాణిగా ట్రైనింగ్ కూడా స్టార్ట్ చేసేసిందట. అప్పటి యాస భాషతో పాటు యుద్ధ విన్యాసాల ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటోందట. హీరో విక్కీ కౌశాల్ కూడా గత కొద్ది రోజులుగా గుర్రపుస్వారీ కత్తి యుద్ధం విలువిద్య నేర్చుకుంటున్నారని సమాచారం. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ను అఫిషీయల్గా ప్రకటించి.. సెప్టెంబర్లో షూటింగ్ స్టార్ట్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారట. మరి ఛత్రపతి శివాజీ కోడలిగా మహారాణిగా రష్మిక ఎలా మెప్పిస్తుందో చూడాలి. ఇదిలా ఉండగా రష్మిక నటించిన పుష్ప2 షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. ఈ సినిమా కూడా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. పుష్పతో ఆకట్టుకున్న రష్మిక.. పుష్ప2లో ఆమె క్యారెక్టర్ ఎలా సాగుతుందా అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## చూపు తిప్పుకోనివ్వని సూపర్ క్యూట్ మృణాల్




ఉత్తరాది ప్రేక్షకులను బుల్లితెర మరియు వెండి తెర ద్వారా సుదీర్ఘ కాలంగా ఎంటర్ టైన్ చేస్తున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ గత ఏడాది దుల్కర్ సల్మాన్ తో కలిసి తెలుగు లో 'సీతారామం' సినిమాలో నటించి సౌత్ ప్రేక్షకులకు సుపరిచితం అయిన విషయం తెల్సిందే. సీతారామం సినిమాలో పద్దతైన చీర కట్టు లో కనిపించి వావ్ అనిపించేంత అందంతో ఈ అమ్మడు ఆకట్టుకుంటూ ఉంది. ఆ సినిమాలో కనిపించిన తీరుకు పూర్తి విరుద్ధంగా మృణాల్ ఠాకూర్ సోషల్ మీడియాలో హాట్ ఫోటోలు షేర్ చేస్తూ అందరిద దృష్టిని ఆకర్షిస్తోంది.

మృణాల్ ఠాకూర్ సోషల్ మీడియాలో ఈ మధ్య షేర్ చేస్తున్న అందాల ఆరబోతకు తెలుగు ప్రేక్షకులు షాక్ అవుతున్నారు. సీతారామం లో మృణాల్ ఠాకూర్ ను చూసిన తెలుగు ప్రేక్షకులు సోషల్ మీడియాలో ఇలాంటి ఫోటోలను చూసి అంతా కూడా బాబోయ్ అంటున్నారు.. మరి కొందరు మాత్రం విమర్శిస్తున్నారు.

స్కిన్ షో చేస్తూ ఈ మధ్య అందాల ఆరబోత చేస్తున్న ఈ అమ్మడు తాజాగా పెద్దగా స్కిన్ షో చేయకుండా కారులోంచి అలా క్యూట్ గా దిగుతూ ఉన్న ఫోటోలు వైరల్ అవుతున్నాయి. క్యూట్ మృణాల్ అందాల ఆరబోతకు ఎంతటి వారైనా ఫిదా అవ్వాల్సిందే. నానితో ఒక సినిమాలో నటిస్తున్న ఈ అమ్మడు హిందీలో ఒకటి రెండు సినిమాలు చేస్తోంది. తెలుగు లో ఈ అమ్మడు మరో రెండు సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం అందుకు సంబంధించిన చర్చలు జరుగుతున్నట్లుగా సమాచారం అందుతోంది.

## సింగం తెరంతా కలర్ ఫుల్ గా ఉందే!






బాలీవుడ్ సక్సెస్ ఫుల్ సింగం ఫ్రాంఛైజీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అజయ్ దేవగణ్ కథానాయకుడిగా రోహిత్ శెట్టి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫ్రాంఛైజీకి హిందీ మార్కెట్ లో అసాధారణమైన క్రేజ్ ఉంది. ఇప్పటివరకూ రిలీజ్ అన్ని చిత్రాలు బాక్సాఫీస్ వద్ద వసూళ్లతో షేక్ చేసాయి. కాప్ యూనివర్శల్ భాగంగా మళ్లీ సింగం ఎగైన్ అంటూ మళ్లీ ఈ ద్వయం రంగం సిద్దం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది ముగింపులో సింగం ఎగైన్ సెట్స్ పైకి వెళ్లనుంది. ఈ నేపథ్యంలో సినిమా గురించి లీక్ అయ్యే ఒక్కో అప్ డేట్ అంతకంతకు ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి. సింగం ఎగైన్ లో ఈ సారి తెరంతా రంగుల మయం కానుందని తెలుస్తోంది. ఇప్పటికే అజయ్ దేవగణ్ సరసన ఓ స్టార్ హీరోయిన్ ని ఎంపిక చేసే పనిలో ఉన్నారు. అదీ కాక ఇంకా మరింత మంది నాయికల్ని ఈ సిరీస్ లోకి తీసుకొస్తున్నారు. దీపికా పదుకొణే ని ఓ కీలక పాత్రకి సంబంధించి ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తి చేసారు. ఇంత పెద్ద హీరోయిన్ తీసుకొచ్చా రంటే? సినిమాలో ఆమె పాత్ర పవర్ ఫుల్ గా ఉంటుందన్నది గెస్ చేయొచ్చు. దీపిక ఎంట్రీతోనే సింగంకి అదనపు హంగులు యాడ్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా మరో స్టార్ హీరోయిన్ ని తెరపైకి తెస్తున్నారు. కరీనా కపూర్ కూడా సినిమాలో భాగమవుతున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. మరో కీలక మైన పాత్రలో ఆమెని దించాలని దర్శకుడు భావిస్తున్నాడుట. ఇదే సిరీస్ లో వచ్చిన సింగం రిటర్న్ లో ఇప్పటికే కరీనా నటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి సెంటిమెంట్ గా ఆ భామని రంగంలోకి దించుతున్నట్లు తెలుస్తోంది. ఇక మెయిన్ లీడ్ రేసులో ఎంత మంది భామలు పోటీలో ఉన్నారో చూడాలి. కీలక పాత్రలకే స్టార్ హీరోయిన్లనే దించుతున్నారంటే? అజయ్ సరసన భామ అంటే అంతకు మించి ఉండేలా ప్లాన్ చేసే అవకాశం ఉంది. మొత్తంగా సింగం ఎగైన్ తెరంతా రంగులమయం అవ్వడం ఖాయంగా కనిపిస్తుంది.

## భోళా శంకర్ అలా చేస్తే రిస్క్ లో పడ్డట్టే..!

వాల్తేరు వీరయ్య తర్వాత మెగాస్టార్ చిరంజీవి చేస్తున్న సినిమా భోళా శంకర్. షాడో తర్వాత మెహర్ రమేష్ తో రిస్క్ చేయాలని ఎవరు అనుకోలేదు. కానీ చిరు మాత్రం అతనికి మరో ఛాన్స్ ఇచ్చారు. భోళా శంకర్ సినిమాను మెహర్ రమేష్ డైరెక్ట్ చేస్తున్నారు. కోలీవుడ్ లో అజిత్ చేసిన వేదాళం రీమేక్ గా ఈ సినిమా వస్తుందని టాక్. చిరు రీ ఎంట్రీ తర్వాత రీమేక్ సినిమాలనే చేస్తూ వస్తున్నాడు. అయితే గాడ్ ఫాదర్ ఇచ్చిన షాక్ తో భోళా శంకర్ తర్వాత ఇక రీమేక్ లు చేసేది లేదని గట్టిగా ఫిక్స్ అయ్యాడట. భోళా శంకర్ సినిమాలో తమన్నా చిరుతో జోడీ కడుతుంటే సినిమాలో కీర్తి సురేష్ చిరుకి సిస్టర్ రోల్ లో కనిపిస్తుంది. మహానటిగా తన సత్తా చాటుతున్న కీర్తి రీసెంట్ గా దసరాతో కూడా తన టాలెంట్ చూపించింది. దసరా



సినిమాలో వెన్నెల పాత్రలో కీర్తి అదరగొట్టేసింది. కీర్తిని సరిగా వాడుకోవట్లేదు కానీ ఆమెతో ఎలాంటి ప్రయోగాలైనా చేసేయొచ్చు అని మరోసారి ప్రూవ్ చేసుకుంది. అయితే ఇది ఇప్పుడు భోళా శంకర్ కి మైనస్ అయ్యే ఛాన్స్ ఉంది. మెగాస్టార్ సినిమాలో సిస్టర్ రోల్ కి కీర్తిని ఎంచుకోవడం పెద్ద షాక్ ఇచ్చింది. సినిమాలో ఆ పాత్ర ఎంత ఇంపార్టెంట్ అయినా సక్సెస్ ఫుల్ హీరోయిన్ ఆమెతో ప్రయోగాలు కూడా చేయొచ్చు అనిపించే హీరోయిన్ ని చిరుకి సోదరిగా చేశారు. అఫ్కోర్స్ కీర్తి కూడా మెగాస్టార్ తో నటించాలనే కోరికతో ఈ ఆఫర్ ఒప్పుకుని ఉండొచ్చు. కానీ కీర్తికి ఇప్పుడున్న ఈ క్రేజ్ దృష్ట్యా సినిమాలో ఆమె పాత్ర ఏమాత్రం వెయిట్ తగ్గినా భోళా శంకర్ రిస్క్ లో పడినట్టే అని చెప్పొచ్చు. కొంతమంది హీరోయిన్స్ వారికి ఉన్న క్రేజ్ కి అందుకు తగిన పాత్రలో నటించాలని ప్రేక్షకులు అభిప్రాయపడతారు. ఈ క్రమంలో కీర్తి సురేష్ భోళా శంకర్ సినిమాలో సిస్టర్ రోల్ అని తెలిసినా ఆ పాత్రని చాలా తగ్గిస్తే మాత్రం ఆ ఎఫెక్ట్ సినిమా రిజల్ట్ మీద ఆధాపడుతుందని అంటున్నారు.

అలా కాకుండా కీర్తిని పర్ఫెక్ట్ గా వాడుకుంటే మాత్రం ఆమె క్రేజ్ సినిమాకు ప్లస్ అవుతుందని చెప్పొచ్చు. దసరా హిట్ తో కీర్తి సూపర్ జోష్ లో ఉండగా నానితో ఆల్రెడీ నేను లోకల్ హిట్ కొట్టిన అమ్మడు దసరాతో ఈ కాంబో క్రేజ్ ని పెంచేసింది.

## మాళవిక సాఫ్ట్ అయినా..ఆలోచనలు మాత్రం మాస్!

మాలీవుడ్ బ్యూటీ మాళవిక నాయర్ టాలీవుడ్ కి సుపరిచితమే. ఎవడే సుబ్రమణ్యం సినిమాతో లాంచ్ అయిన అమ్మడు అటుపై కొన్ని సినిమాల్లో నటించింది. విజయాలు ఉన్నా లేకపోయినా అవకాశాలు మాత్రం బాగానే అందిపుచ్చుకుంటుంది. అందం..అభినయం గల నాయిక. చూడటానికి ఎంతో సాఫ్ట్ గానూ కనిపిస్తుంది. మరి ఈ బ్యూటీ మనసులో అన్నీ మాస్ ఆలోచనలే ఉన్నాయా? అంటే అవుననే తెలుస్తోంది. చూడటానికి మాళవిక సాఫ్ట్ గా ఉన్నా..లోపల అంతా ఊర మాస్ లెక్క. డీసెంట్ పాత్రలు పోషించడం కంటే యాక్షన్ నేపథ్యం గల సినిమాలు చేయడం అంటే ఎక్కువ ఇష్టం అంటుంది. దర్శకులు అలాంటి అవకాశాలతో ముందుకొస్తే ఎలాంటి మెహమాటం లేకుండా ఎస్ చెప్పేస్తుందిట.



తన దగ్గరకు ప్రతీ దర్శకుడు తనలో బ్యూటీని చూసి కొన్ని రకమైన పాత్రలకే పరిచయం చేస్తున్నట్లు చెప్పుకొచ్చింది. అలా కాకుండా తనలో మాస్ కోణాన్ని కూడా చూసి ఆ రకమైన పాత్రలతో వస్తే మరింత సంతోషిస్తానని అంటుంది. యాక్షన్ సినిమాలు చేయడం తనకి ఓ డ్రీమ్ గా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం నటిస్తోన్న డెవిల్ సినిమాలో ఆ రకమైన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపింది. అలాగే సినమా ఫలితాలు ఎలాంటి ప్రభావం చూపిస్తాయని ప్రశ్నిస్తే.. కొన్ని విషయాలు మన చేతుల్లో ఉండవు. కథలు ఎంపిక చేసుకోవడం..పాత్రలకు తగంట్టు నటించడం వంటివి మన నియంత్రణలోనే ఉంటాయి. కానీ ఫలితాలు అన్నిసార్లు మనకు అనుకూలంగా రావు. దాన్నివ్యక్తిగతంగా మాత్రం తీసుకోను. చూట్టూ వాతావరణంలో మార్పులు కనిపిస్తాయి. విజయాలు వచ్చినప్పుడు ఒకలా మాట్లాడుతారు. పరాజయాలు ఎదురైనప్పుడు మరోలా స్పందిస్తుంటారు. ఎదుట వారు ఎలా ఉన్నా మనమేంటి? అన్నది మన అంతరాత్మకి తెలుసు. కాబట్టి అలాంటి వాటి గురించి పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదని తెలిపింది. తాజాగా ఈ బ్యూటీ నటించిన అన్ని మంచి శకునాలే సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇందులో సంతోశ్ శోభన్ హీరోగా నటించగా నందిని రెడ్డి దర్శకత్వం వహించారు.

గరుడ వార్త



# తెలంగాణకు మరో భారీ పెట్టుబడి.. మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు అంతర్జాతీయ సంస్థలు తరలివస్తున్నాయి. ఇప్పటికే ప్రపంచ దిగ్గజ కంపెనీలు తమ కార్యకలాపాలను హైదరాబాద్ నుంచి ప్రారంభించాయి. తాజాగా బ్రిటన్‌కు చెందిన ప్రఖ్యాత బ్యాంకింగ్ సంస్థ లాయిడ్స్ గ్రూప్ రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. లాయిడ్స్ గ్రూప్ సంస్థ ప్రతినిధులు మంత్రి కేటీఆర్‌తో భేటీ అయ్యారు. తమ సాంకేతిక కేంద్రాన్ని త్వరలో హైదరాబాద్‌లో ప్రారంభించేందుకు లాయిడ్స్ బ్యాంకింగ్ గ్రూప్ ముందుకు వచ్చినట్లు కేటీఆర్ తెలిపారు. తొలి ఆరు నెలల్లోనే 600 మందిని లాయిడ్స్ బ్యాంకింగ్ గ్రూప్ నియమించుకోనుంది. అమెరికా, యూకే పర్యటనల్లో భాగంగా మే 13వ తేదీన లాయిడ్స్ బృందంతో సమావేశమైనట్లు కేటీఆర్ తెలిపారు. అతి తక్కువ వ్యవధిలోనే హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించడంపై మంత్రి కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. 2.8 కోట్లకు పైగా కస్టమర్లతో రిటైల్ అండ్ వాణిజ్య విభాగాల్లో లాయిడ్స్ సంస్థ సేవలందిస్తుంది.

# అర్చకులకు దూపదీప నైవేద్యం పథకం పత్రాలను అందజేసిన మంత్రి హరీష్‌రావు



సిద్దిపేట: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా సిద్దిపేట వెంకటేశ్వర ఆలయంలో నిర్వహించిన పూజల్లో మంత్రి హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో కొత్తగా 171 మంది అర్చకులకు దూప దీప నైవేద్యం పథకం మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. అనంతరం మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ... 171 మంది పూజారులకు ధూప దీప నైవేద్యం మంజూరు పాత్రలు అందజేశామని తెలిపారు. సీఎం కేసీఆర్ 1990లో బ్రహ్మ యజ్ఞం చేశారని గుర్తుచేశారు. కొండగట్టు, ధర్మపురి లక్ష్మీనరసంహస్వామి, యాదాద్రి, కొండపోచమ్మ, కొమురవెల్లి మల్లన్న స్వామి ఇలా ఎన్నో ఆలయాలు అభివృద్ధి చేశారన్నారు. జీర్ణ దేవాలయాల పునరుద్దరణ పనులు 40 కోట్లతో జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. కొనయపల్లి వెంకటేశ్వర స్వామి గుడిని గొప్పగా అభివృద్ధి చేసుకున్నామన్నారు. 2500 దేవాలయాలు కొత్త ధూప దీప నైవేద్యంలోకి తెచ్చారని అన్నారు. సీఎం కేసీఆర్ 6 వేల రూపాయల నుంచి 10 వేల రూపాయలకు పెంచారన్నారు. గతంలో 1805 దేవాలయాలకు రూ.500 ఇచ్చేవారని చెప్పారు. 2500 కలిపి 6441 దేవాలయాలకు ప్రతి నెల 10 వేల రూపాయలు ఇవ్వనున్నట్లు... దీని కోసం ప్రభుత్వం ప్రతినెల రూ.77 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 33 జిల్లాలలో మన సిద్దిపేటకు 171 సాంక్షన్లు రావడం సంతోషకరమన్నారు. ఎక్కడ ధూప దీప నైవేద్యం ఉంటుందో అక్కడ అంతా శుభం జరుగుతుందని అన్నారు. సీఎం కేసీఆర్‌ను, మన ప్రభుత్వాన్ని అంతా దీవించాలని మంత్రి హరీష్‌రావు కోరారు.

# తెలంగాణ ప్రజల ఆశలను కేసీఆర్ కాలరాశారు: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ ప్రజల ఆశలను సీఎం కేసీఆర్ కాలరాశారని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని మాజీ ఎంపీ పొంగులేటి నివాసానికి వెళ్లిన రేవంత్‌రెడ్డి, కోమటి రెడ్డి వెంకటరెడ్డి, చిన్నారెడ్డి, మల్లు రవి తదితరులు పొంగులేటి, అతని మిత్రబృందం కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. అనంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ వ్యతిరేక రాజకీయ పునరేకీకరణ దిశగా పలువురు నేతలను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. పొంగులేటితో పాటు ఇతర నేతల చేరిక, కలయిక తెలంగాణకు ఉజ్వల భవిష్యత్తును ఇస్తుందన్నారు."తెలంగాణ ఏర్పాటుకు ప్రొ.జయశంకర్ పరితపించారు. తెలంగాణ జాతిపితగా జయశంకర్‌ను 4 కోట్ల మంది గౌరవించుకున్నారు. తొలిదశ, మలిదశ ఉద్యమంలో ఆయన క్రియాశీలపాత్ర పోషించారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతకర్తగా పేరుగాంచారు. కానీ, ఆయన ఆశించిన ఫలితాలు రాలేదు. కేసీఆర్ కుటుంబం కోసం తెలంగాణ వనరులను కబ్జా చేశారు. కేసీఆర్ కుటుంబానికి తప్ప ఇతరులకు ప్రయోజనం చేకూరలేదు. రాజకీయ ప్రయోగశాలలో తెలంగాణను వేదికగా మార్చారు. తెలంగాణలో రాజకీయ పరిణామాలపై పార్టీ అధిష్ఠానంతో చర్చిస్తాం. త్వరలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీతో సమావేశమవుతాం. ఖమ్మంలో కనీవిని ఎరుగని రీతిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# తెలంగాణ ప్రజల కోసం అందరం ఏకమవుతున్నాం: పొంగులేటి



హైదరాబాద్: తెలంగాణ ప్రజల కోసం అందరం ఏకమవుతున్నామని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. తన నివాసంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలతో భేటీ అనంతరం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో చేరాలని రేవంత్‌రెడ్డి ఆహ్వానించినట్టు చెప్పారు. "ఉద్యమకారులు, ప్రజలు, కవులతో ఇప్పటికే చర్చలు జరిపాం. కొద్దిరోజుల్లోనే పూర్తి వివరాలను ప్రకటిస్తాం. మూడు నాలుగు రోజుల్లో పార్టీలో చేరికపై ప్రకటన ఉంటుంది. 6 నెలల నుంచి పరిస్థితులను గమనిస్తున్నాం. నేను, జూపల్లి కలిసి తెలంగాణలో పర్యటిస్తూనే ఉన్నాం. తెలంగాణ వచ్చాక ప్రజల కలలు సాకారం కాలేదు" అని పొంగులేటి వివరించారు. మాజీ మంత్రి జూపల్లి మాట్లాడుతూ... "సీఎం కేసీఆర్ దేశానికే ఆదర్శంగా నిలిచామని చెబుతున్నారు. అవినీతిలోనా? మాట తప్పడంలోనా? స్కీమ్‌లు ఎత్తివేయడంలోనా? ఎందులో ఆదర్శం? ప్రాజెక్టుల నిర్మాణాన్ని స్వాగతిస్తాం.. కానీ, వాటి వెనుక జరిగిన అవినీతి ఎంత?. ప్రాజెక్టుల నిర్మాణంలో అవినీతి జరగకుండా ఉండి ఉంటే రాష్ట్రంలో డబుల్ బెడ్‌రూమ్‌ల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేది. నిరుద్యోగ భృతి ఇచ్చే వాళ్లం. రైతు రుణ మాఫీ పూర్తయ్యేది. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి ఫరిడవిల్లుతోంది. రైతాంగం గోస పడుతున్నారు" అని జూపల్లి ఆరోపించారు.

# నువ్వు మగాడివైతే టీడీపీలో ఉండి గెలువు.. గంగులకు పొన్నం సవాల్



కరీంనగర్: మంత్రి గంగుల కమలాకర్ వ్యాఖ్యలపై మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంత్రి గంగుల కమలాకర్ మగాడివైతే టీడీపీలో ఉండి గెలవాలని సవాల్ విసిరారు. బుధవారం పొన్నం మీడియాతో మాట్లాడుతూ... ఔట్ డేటెడ్ అని మీ వినోద్ రావుని అన్నవా గంగుల అంటూ ప్రశ్నించారు. "నా ఓటమి గురించి మాట్లాడుతున్నావ్.. సీఎం కూతురు కవిత ఓడిపోలేదా" అని వ్యాఖ్యలు చేశారు. ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్న కరీంనగర్ పార్లమెంట్‌లో వినోద్ రావు ఎంపీగా ఓడిపోలేదా అని నిలదీశారు. గంగుల దొంగ రాజకీయాలు చేస్తారని మండిపడ్డారు. దున్నపోతులా బలిసి రైతుల గురించి పట్టించుకోవట్లేదని విరుచుకుపడ్డారు. బీజేపీ నేత బండి సంజయ్, మంత్రి గంగుల ఆలయాల్లో కలుసుకుంటున్నారని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం రోజుకో పండుగను నిర్వహించడంపైనా మాజీ ఎంపీ విమర్శలు గుప్పించారు. దశాబ్ది ఉత్సవాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ బెల్ట్ షాప్‌ల పండుగ మరిచిపోయారు అంటూ పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు.

# కామినేని గ్రూప్ చైర్మన్, ఎండీ నివాసాలపై ఈడీ సోదాలు



హైదరాబాద్ : కామినేని గ్రూప్‌పై ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. కామినేని గ్రూప్ చైర్మన్, ఎండీ నివాసాలపై సోదాలు జరుగుతున్నాయి. తెలంగాణలో మొత్తంగా 15 చోట్ల ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. ఎస్వీఎస్ మెడికల్ కాలేజ్‌లో సైతం సోదాలు జరుగుతున్నాయి. అలాగే మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాలలో ఈడీ సోదాలు నిర్వహిస్తోంది.

-షామీర్‌పేటలోని మెడిసిటీ కళాశాలలో ఏరియా అధికారులు సోదాలు చేస్తున్నారు. అలాగే.. ఫిల్మ్ నగర్ లోని ప్రతిమా కార్పొరేట్ కార్యాలయంపై సోదాలు నిర్వహిస్తోంది. ఈడీ అధికారులు రెండు టీమ్స్‌గా విడిపోయి మరీ సోదాలు నిర్వహిస్తున్నారు. ప్రతిమా గ్రూప్‌కి చెందిన ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్‌లో మరోసారి ఈడీ రైడ్స్ కలకలం రేపుతున్నాయి. ఇటీవలే పలువురు బీఆర్ఎస్ నేతల ఇళ్లు, కార్యాలయాలపై దాడులను ఈడీ నిర్వహించిన విషయం తెలిసిందే. వారిని విచారణకు సైతం రమ్మంటూ నోటీసులు జారీ చేసింది. నేడు బషీర్ బాగ్‌లోని ఈడీ కార్యాలయం నుంచి ఈడీ అధికారులు 11 బృందాలుగా వెళ్లారు. భారీగా సీఆర్పీఎఫ్ బలగాలతో ఈడీ బృందాలు బయలుదేరాయి. హైదరాబాద్‌తో పాటు నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్నగర్, మేడ్చల్, ఖమ్మం జిల్లాలో ఈడీ రైడ్స్ జరిగే అవకాశం ఉంది.



# సాగర్ రింగ్ రోడ్డు వద్ద..
# ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో ప్రమాదం

కర్మాన్‌ఘాట్: హైదరాబాద్‌లోని సాగర్ రింగ్‌రోడ్డు కూడలిలో చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో ప్రమాదం జరిగింది. పిల్లర్ల మధ్య ఇనుప ర్యాంప్ ఏర్పాటు చేస్తుండగా అది ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ఘటనలో 9 మంది కార్మికులకు గాయాలు కాగా.. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన కార్మికులంతా బిహార్‌కు చెందిన వారిగా తెలుస్తోంది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మేజర్ ప్రాజెక్టు అధికారులు చేరుకుని పరిశీలించారు. పొక్లెయిన్ సాయంతో శిథిలాలను తొలగిస్తున్నారు.



# త్వరలో భారత్‌కు టెస్లా!

వాషింగ్టన్: భారత్‌లో టెస్లా కార్యకలాపాలు వీలైనంత త్వరగా ప్రారంభమవుతాయని కంపెనీ సీఈఓ ఎలాన్ మస్క్ ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ అంశంపై ప్రకటన ఉండే అవకాశం ఉందని చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీతో ఆయన బుధవారం భేటీ అయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. మోదీతో భేటీ అద్భుతంగా జరిగిందని సమావేశం అనంతరం మస్క్ తెలిపారు.

**స్థానిక చట్టాలను ట్విటర్ పాటించాల్సిందే..** స్థానిక ప్రభుత్వాల నియమ, నిబంధనల్ని పాటించడం తప్ప మరోమార్గం లేదని ట్విటర్ విషయంలో మస్క్ స్పందించారు. లేదంటే కార్యకలాపాలు మూసివేయాల్సి వస్తుందని తెలిపారు. సాగు చట్టాలపై రైతుల ఆందోళనల సమయంలో ట్విటర్‌పై భారత ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందంటూ ఇటీవల ట్విటర్ మాజీ సీఈఓ జాక్ డోర్సే ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో మస్క్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఆయా దేశాల చట్టాలను పాటించాల్సిందేనని మస్క్ ఉద్ఘాటించారు. నిబంధనలకు లోబడే వీలైనంతలో వాక్ స్వేచ్ఛను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

**వచ్చే ఏడాది భారత్‌కు..** వచ్చే ఏడాది భారత్‌లో పర్యటించే యోచనలో ఉన్నట్లు మస్క్ తెలిపారు. సాధ్యమైనంత త్వరలో భారత్‌లో టెస్లా ప్రవేశం ఉంటుందని తాను బలంగా నమ్ముతున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ప్రధాని మోదీ నుంచి మంచి సహకారం లభిస్తోందని వెల్లడించారు. అందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే దీనిపై ఓ సానుకూల ప్రకటన ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఒక్క ప్రకటనలో తాము దీన్ని తేల్చేయాలనుకోవడం లేదని.. భారత్‌తో సంబంధాల విషయంలో తమ నిర్ణయం కీలకంగా మారనుందని పేర్కొన్నారు.

**మోదీకి అభిమానిని..** ఇతర పెద్ద దేశాలతో పోలిస్తే భారత్‌లో అవకాశాలు మెండుగా ఉన్నాయని మస్క్ అభిప్రాయపడ్డారు. భారత భవిష్యత్‌పై తాను చాలా ఆసక్తిగా ఉన్నానని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీపై మస్క్ ప్రశంసల వర్షం కురిపించారు. భారత్‌పై మోదీకి చాలా శ్రద్ధ ఉందని వ్యాఖ్యానించారు. దేశంలో పెట్టుబడుల పెట్టాలని ఆయన ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. తాను మోదీకి అభిమానని చెప్పారు. సౌర ఇంధనంలో పెట్టుబడులకూ అక్కడ గొప్ప అవకాశాలు ఉన్నాయన్నారు. మస్క్‌తో భేటీ గొప్పగా జరిగినట్లు మోదీ ట్వీట్ చేశారు. ఇంధనం నుంచి ఆధ్యాత్మికత వరకు వివిధ అంశాలపై చర్చించినట్లు తెలిపారు. దీనికి మస్క్ స్పందిస్తూ.. "మీతో మళ్లీ సమావేశం కావడం గౌరవంగా భావిస్తున్నా" అని అన్నారు. మోదీ అమెరికా పర్యటన ఈ నెల 24 వరకు కొనసాగనుంది. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం బయల్దేరిన ఆయన అమెరికా కాలమానం ప్రకారం మధ్యాహ్నం న్యూయార్క్‌కు చేరుకున్నారు. ఆయనకు అమెరికాలో మన దేశ రాయబారి తరణ్‌జీత్ సింగ్ సంధు, ఐరాసలో శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ స్వాగతం పలికారు. ప్రవాస భారతీయులు విమానాశ్రయానికి వచ్చి మోదీని స్వాగతించారు. మోదీ మోదీ అంటూ నినాదాలు చేశారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొననున్నారు.

# వెలుగును చూడటం ఇష్టంలేని వారు ఎప్పటికీ చీకట్లోనే ఉండిపోతారు.. కాంగ్రెస్ నేతలపై మంత్రి జగదీశ్ రెడ్డి ఫైర్



సూర్యాపేట: కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఇప్పటికే నిరసన తెలియజేశారని, అందుకే ప్రతిపక్షంలో ఉన్నారని మంత్రి జగదీశ్ రెడ్డి ఫైరయ్యారు. అయినా ఆ పార్టీ నాయకులు ఇంకా బుద్ధి తెచ్చుకోకపోగా అవాస్తవాలు మాట్లాడుతూ యాత్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఏది అవాస్తవమని నిరసన చేస్తారని ఆ పార్టీ నాయకులను ప్రశ్నించారు. సూర్యాపేట 'దశాబ్ది దగా' పేరుతో కాంగ్రెస్ చేపట్టబోయే నిరసనల అంశంపై మంత్రి జగదీష్ రెడ్డి మండిపడ్డారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందటం అవాస్తవమని నిరసనా తెలుపుతారా అని నిలదీశారు. తమ ప్రభుత్వం వేసిన రోడ్ల మీద నడుస్తున్న ప్రతిపక్షాలు.. తామిస్తున్న మంచినీళ్లు తాగడం అవాస్తవమా అని మండిపడ్డారు. ఫ్లోరిన్ నీటి నుంచి విముక్తి చేయడం అవాస్తవమా అని విమర్శించారు. ఏ అభివృద్ధి జరగలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. అబద్దాలతో ప్రజలను నమ్మిస్తామని మూర?పు భావనలో ప్రతిపక్షాలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. చీకట్లో నడిచేవారు వెలుగును సృష్టించలేరని, వెలుగును చూడటం ఇష్టంలేని వారు ఎప్పటికీ చీకట్లోనే ఉండిపోతారన్నారు.

# 22న గోల్కొండ బోనాల ప్రారంభంతో 'ఆషాఢ' జాతర షురూ..



హైదరాబాద్ : ఈ నెల 22వ తేదీ నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో ఆషాఢ బోనాల జాతర ప్రారంభం కానుంది. మొట్టమొదటగా గోల్కొండ బోనాలు ప్రారంభం కానున్నాయి. లంగర్ హౌస్‌లో నిర్వహించే గోల్కొండ బోనాల తొట్టెల ఊరేగింపులో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇంద్రకరణ్ రెడ్డి, మహమూద్ అలీ పాల్గొననున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది.

ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు మంత్రి తలసాని శ్రీనివాన్ యాదవ్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఆషాఢ బోనాల ఉత్సవాలతో నెల రోజులపాటు సందడిగా మారనున్నాయి జంట నగరాలు.

# హైదరాబాద్‌లో అర్ధరాత్రి జంట హత్యల కలకలం

హైదరాబాద్: నగరంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక వేర్వేరు ప్రాంతాల్లో రెండు జంట హత్యలు కలకలం రేపాయి. టపాచబుత్ర పీఎస్ పరిధిలో ఇద్దరు హిజ్రాలను దుండగులు దారుణంగా హతమార్చారు. మృతులు దైబాగ్ ప్రాంతానికి చెందిన యూసఫ్ అలియాస్ డాలీ, రియాజ్ అలియాస్ సోఫియాగా పోలీసులు గుర్తించారు. వీరిద్దరిని గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి, రాళ్లతో కొట్టి హత్య చేశారు. మరోవైపు రాజేంద్రనగర్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఇద్దరిని బండరాళ్లతో మోది హత్య చేశారు. ఈ హత్యలు వేర్వేరు ప్రాంతాల్లో జరిగినప్పటికీ.. ఇద్దరినీ ఒకే విధంగా బండరాయితో కొట్టి హతమార్చారు. ఒకే రాత్రి రెండు జంట హత్యలు చోటు చేసుకోవడం స్థానికులను భయబ్రాంతులకు గురిచేసింది. హత్యోదంతాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. టపాచబుత్ర ఘటనకు సంబంధించి పోలీసులు ఆధారాలు సేకరించారు. ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. హత్య జరిగిన ప్రాంతాన్ని దక్షిణ మండల డీసీపీ కిరణ్ పరిశీలించారు. మృతదేహాలను శవపరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. "టపాచబుత్ర పోలీస్? స్టేషన్? పరిధిలో అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో జంట హత్యలు జరిగినట్లు మాకు సమాచారం అందింది. వెంటనే మేం ఇక్కడికి వచ్చాం. మృతులు ఇద్దరు ట్రాన్స్?జెండర్లు.. వారి వయస్సు 25 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉంటుంది. వారు ఈ ప్రాంతానికి చెందినవారే. అక్రమ సాన్నిహిత్యం కారణంగా హత్య జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నాం. దాని ప్రకారమే అనుమానితుల్ని అదుపులోకి తీసుకుంటున్నాం. రెండు రోజుల్లో నిందితుల్ని పట్టుకుంటాం. బాధితుల్ని బండరాయితో, కత్తులతో పొడిచి చంపారు. కత్తిని స్వాధీనం చేసుకున్నాం. క్లూస్ టీమ్? కూడా వచ్చింది" అని సౌత్ జోన్ డీసీపీ కిరణ్ తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com